### నానీలు

అమ్మలంతా
యశోదమ్మలే
బిడ్డ అబద్ధాలన్నీ
తెలిసినా నమ్ముతారు

ఇల్లంటే
నాలుగు గోడలుకాదు
అందరి హృదయాల్లో
మమతల నీడలు

చదివితే
జ్ఞానం వస్తుంది
లోకాన్ని చదివితే
జీవించడం తెలుస్తుంది

బిడ్డలెందరున్నా
అమ్మ సాకుతుంది
బిడ్డలంతా కలిసి
అమ్మను సాకలేరెందుకో.

కనిపించని
దేవుళ్ళకు మొక్కుతూ
కన్న దేవుళ్ళను
మరుస్తారెందుకో!



-గడ్డం సులోచన
సెల్:7702891559

### ఘంటారావం

కళ్లు క్రిందికి వాలుతున్నాయంటే
కల్లలు జాలువారుతున్నాయన్నట్లే
కదలికల్లో అసహనం కనబడుతుందంటే
అంతరంగంలో అలజడుల జాడలున్నట్లే

ఏమి మాట్లాడాలో
నిర్ణయించేది జ్ఞానం
ఎలా మాట్లాడాలో
నిర్ణయించేది సంస్కారం.

తరంగాలెన్ని ఢీకొట్టినా
తీరం తొణకదు
సమస్యలెన్ని చుట్టుముట్టినా
స్థితప్రజ్ఞత బెణకదు

పీఠాలపై ప్రకాశించేవారు
సామాన్యులు
పీఠాలకే ప్రకాశాన్నిచ్చేవారు
అసామాన్యులు.



-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

# అమృతలత ఆత్మకథకు అభినందన చందనం!

ఆమెది అసాధారణ వ్యక్తిత్వం.. నిజాయితీకి నిలువుటద్దం ఆమె! ఆమె ఓ తపస్విని! ఓ మానవతా మూర్తి! వెన్నెలను ఒడిసిపట్టిన అడవి తల్లి.. విశ్రాంతి ఎరుగని నిత్య శ్రామికురాలు.. అమె అరుదైన స్త్రీ మూర్తి.. ఆమె ఎవరో కాదు.. విద్యావేత్త.. సాహితీవేత్త... ఆధ్యాత్మిక వేత్త డా॥ అమృతలతగారు.ఏ మాత్రం భేషజం లేకుండా తమ ఆత్మకతను.. అందరికీ స్ఫూర్తి నిచ్చేలా **"నా ఏకాంత బృందగానం"** పేరుతో వెలువరించి అందరి దృష్టినాకర్షించారు. అమృతలతగారు సచిత్ర స్వీయ చరిత్రగా మలచబడ్డ **"ఏకాంత బృందావనం"**పై కవులు, రచయితలు, పాఠకులు స్పందించి సమీక్షల రూపంలో అందించారు. వాటన్నింటినీ ఏర్చి కూర్చి **"బృందగానం"** పేరుతో సమీక్షల సమాహారంగా మరో పుస్తకాన్ని వెలువరించారు. **" ఏకాంత బృందావనం"**లోని విశేషాలను.. అమృతగారి వ్యక్తిత్వాన్ని.. రచనా వ్యాసంగాన్ని సామాజిక సేవా తత్పరతను రేఖా మాత్రంగా ఆవిష్కరిస్తూ..ఆమె యొక్క జీవితానుభవాలను.. జీవన సంఘర్షణలను.. జీవన రేఖలను ఆమె స్వయంగా ఆవిష్కరించిన అంశాల ఆధా రంగా పలువురు సమీక్షలు రాసి అమృతలతగారి మూరిమత్వాన్ని పదిమందికి పంచడం ముదావహం.

> **ఏ మాత్రం భేషజం లేకుండా తమ ఆత్మకతను.. అందరికీ స్ఫూర్తి నిచ్చేలా "నా ఏకాంత బృందగానం" పేరుతో వెలువరించి అందరి దృష్టినాకర్షించారు**

అమృతలతగారి **"నా ఏకాంత బృందగానం"** ఆత్మకథపై స్పందించి.. సహృదయ సమీక్షలు రాశారు. రాసిన వారిలో ప్రవర్ధమాన రచయితలతో పాటు వర్ధమానులు, బంధుమిత్రులున్నారు. సమీక్ష లొక్కక్కరు అమృతలతగారి ఆత్మకథను.. విభిన్న కోణాల్లో ఆవిష్కరించారు. దాదాపు 56 మంది రాసిన సమీక్షలకు 'బృందావనం"లో చోటు కల్పించారు. ఈ గ్రంథాన్ని 2025 అమృతలత అపురూప పురస్కారాల ప్రదానోత్సవాల్లో ప్రముఖ సినీ నటి రోహిణిగారితో ఆవిష్కరింపజేసి.. సమీక్షకులందరినీ సాదారంగా ఆహ్వానించి పుస్తకాన్ని అందజేశారు.

ఈ సమీక్షా సంకలనానికి ఆత్మీయ పలుకులు రాసిన ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి ఓల్గాగారు పేర్కొన్నట్లు.. ఆమె ఆత్మకథ ఒక సహజ సౌందర్య కుడ్య చిత్రం! అందరు చదివి ప్రేరణ పొందదగిందని అన్నారు.

అమృతలతగారి బాల్యం, యవ్వనం, వంటి అంశాలతో పాటు.. ఆమె తమ జీవితంలో ఎదుర్కొన్న అవరోధాలను.. బంధు మిత్రులతో వున్న బంధాలు, అనుబంధాలను- సాధించిన విజయాలను.. సాహిత్య, సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, విద్యా రంగాల్లో ఆమె చేస్తున్న కృషిని "ఏకాంత బృందావనం"లో ఆమె స్వయంగా నిక్షిప్తం చేసుకున్న విషయాలను- సమీక్షకులు చక్కగా సమీక్షించి "బృందావనం" గ్రంథానికి శోభను కూర్చారు.

డా॥ మైథిలి అబ్బరాజుగారు రాసిన సమీక్షా వ్యాసంలో అమృతలతగారు ఎప్పుడూ అంత ఎత్తు మీదనే ఉన్నారనీ.. సాధించడంలోనూ.. సంఘర్షణ లోనూ.. విషాదంలోనూ.. స్పష్టంగా నిటారుగా నిలబడే ఉన్నారని కొనియాడారు.

ఔను.. అమృతలతగారు వెన్నెలను ఒడిసిపట్టారని.. బాల్యంలో తన తల్లిదండ్రులు.. అన్నలు- అక్క చెల్లెళ్లు, స్నేహితులతో గడిపిన ఆమె జ్ఞాపకాలను.. అనుభవాలను చదువుంటే.. బాల్యం నుండే ఆమెలోని ధైర్యం- అనుకున్నది చేసి తీరాలనే పట్టుదల అడుగడుగునా కనిపిస్తాయని "డా" విజయలక్ష్మి పండిట్ పేర్కొన్నారు. ఈ "ఆత్మకథ" సావనీర్‌ను తలపించేలా మారడం తనను ఓ పాఠకురాలిగా నిరాశ పరిచిం దనీ.. ఫోటోల డిస్ట్రాక్షన్ కొంత ఇబ్బంది కలిగించిందని పి. జ్యోతిగారు అభిప్రాయపడ్డారు. అయినా.. ఆమె పొందుపరిచిన ఇందలి కొన్ని విషయాలు కొందరికైనా స్ఫూర్తినివ్వగలవని పేర్కొన్నారు. అమృతలతగారి జీవిత చరిత్ర చదువుతుంటే.. అందరి కోసం ఒక్కరు- ఒక్కరి కోసం అందరం కలిసి అన్న పదాలు గుర్తుకొచ్చాయని సి.ఏ. ప్రసాద్‌గారు పేర్కొన్నారు. "బృందావనమది అందరిదీ" అంటూ నెల్లుట్ల రమాదేవిగారు రాసిన సమీక్షా వ్యాసంలో.. అమృతలతగారి జీవితాన్ని చక్కగా ఆవిష్కరించారు. ఆమె ఏకాంతంలో జీవన సౌందర్యముందనీ.. ఆమెను ధీరగా, మౌన పోరాట యోధగా అభివర్ణించారు.

శారీరకంగా, మానసికంగా ఎన్నో బాధలు అనుభవించినా.. వాటిని అధిగమించి.. న్యూనతాభావం నుండి అమృతలత బయటపడ్డారని డి. కామేశ్వరిగారు అభిప్రాయపడ్డారు.

"ఏకాంత బృందగానం"లో ఇప్పుడు లేని పాతకాలపు అనేక పద్ధతుల్ని తేట తెల్లం చేయడానికి ఇందలి చిత్రాలు తోడ్పడ్డాయని ఇవి కార్టూన్లు కావు.. జీవన వాస్తవిక ప్రతిబింబాలని దాట్ల దేవదానం రాజుగారు ప్రశంసించారు. డా॥ అమృతలతగారు స్థాపించిన విద్యాలయాల గురించి చదువుతుంటే సంభ్రమం కలుగుతుందని జి.ఎస్.లక్ష్మిగారు పేర్కొన్నారు. కలలను సాకారం చేసుకునే ధీర! అంటూ రమాశాండిల్యాగారు తమ సమీక్ష రాస్తే.. విశ్రాంతి ఎరుగని నిత్య శ్రామికురాలు అంటూ పుట్టి నాగలక్ష్మిగారు తమ సమీక్షను తీర్చిదిద్దారు.

నీ నడక, నీ నడత, నీ మాట, నీ చేతల్లో.. రాజసం ఉట్టిపడుతుందనీ.. ఎంతో మంది స్త్రీలకు నీవు రోల్‌మాడల్ అంటూ ఏ. సుకేశినిగారు ప్రశంసిస్తే.. అమృతలతగారు దారి చూపే దీపస్తంభమని ఎన్. విజయాకిషన్‌రెడ్డిగారు అభిప్రాయపడ్డారు. "ఏకాంత బృందగానం" ఏకబిగిన ఆసాంతమూ చదివించే గ్రంథమనీ.. శిష్ట వ్యవహారిక భాష, శైలీ..ఎన్నిసార్లు చదివినా మళ్లీ కొత్తగా చదువుతున్న అనుభూతిని పొందగలమని కిరణ్‌బాలగారు తమ సుదీర్ఘ సమీక్షలో పేర్కొన్నారు. ఆమె కౌమారదశ నుండే ఉన్నత వ్యక్తిత్వాన్ని సొంతం చేసుకున్నారనీ.. ఆమె నేర్చుకున్న జీవిత పాఠాలు.. సమస్యల సాధనకు ఉపయోగపడే సూత్రాలని తేల్చి చెప్పారు.ఎవరినీ మరువని ఔన్నత్యం అమృతలతగారిదంటూ ఆర్. విజయగారు అభిప్రాయపడితే.. ప్రపంచానికి సమర్పిస్తోన్న కృతజ్ఞతాపత్రమని డా॥ కిరణ్‌కుమార్ సుగ్గాల కొనియాడారు.

ఆమె పడిలేచిన కెరటమని లీలారెడ్డిగారు పేర్కొంటే.. బతుకు విలువ- మెతుకు విలువ తెలిసిన వ్యక్తిగా సుశీలనాగరాజుగారు తమ సమీక్షను రూపుదిద్దారు.

ఆమె ఒక వ్యక్తి కాదు శక్తి అంటూ డా॥ రొంపిచర్ల భార్గవిగారు రాస్తే.. అమృతత్వం, లతలా అందరి హృదయాలను అల్లుకుపోవడం వంటి ప్రత్యేక గుణాలు కలగలిపిన అమృతమూర్తి అమృతలతగారంటూ పరిమళ రుసుంగారు తమ సమీక్షా వ్యాసాన్ని తీర్చిదిద్దారు. అమృతలత నిజాయితీకి నిలువుటద్దమని ఏ.ఎస్.లక్ష్మిగారు పేర్కొంటే.. తనను నమ్మిన స్నేహితురాళ్ళకు ఆమె కొంగు బంగారమని దొడ్డపనేని అఖిలాండేశ్వరిగారు అభినందించారు. జీవితంలో ఏదీ ఊరికే దొరక దని ఆమె జీవితం ద్వారా అర్థమైందని వివరించారు.

ఈ పుస్తకంలోని ప్రతి అక్షరం నిజరూప దర్శనం! ప్రతి సంఘటనా అనుభూతుల సమాహారమని డా॥ సమ్మెట విజయగారు పేర్కొంటే.. వెండిగిన్నెలో పెట్టిన వెన్న ముద్ద అని ఛాయా ప్రదీపగారు తమ సమీక్షను రాశారు. "ఏకాంత బృందగానం" భవిష్యత్ తరాలకు చారిత్రక రికార్డు అని ప్రొ. సి.హెచ్. సుశీలమ్మగారు కొనియాడితే.. అమృతలత గారి బాల్య జ్ఞాపకాలన్నీ ఆనందభైరవి రాగంలో, పాఠకుల హృదయాలను మీటుతూ సాగుతోన్న క్రమంలో.. ఆ చేతికి తగిలిన గాయం.. ఆ రాగాన్ని అపశ్రుతిలోకి నెట్టిందని శీలా సుభద్రదేవిగారు అభిప్రాయపడ్డారు. స్వయంకృషి, క్రమశిక్షణ, పట్టుదల, అంకితభావమూ కలిగివుంటే మహిళలు సాధించలేనిదీ ఏదీ లేదంటూ తన జీవితం ద్వారా రుజువు చేశారని నాంపల్లి సుజాతగారు రాస్తే.. ఆమె ఓ చరిత్ర! అటూ నందూరి సుందరీ నాగమని పేర్కొన్నారు.

నిప్పుల్లో కాలి.. ఆభరణంగా రూపుదాల్చిన వ్యక్తి జీవన గాథ డా॥ అమృతలతగారి ఆత్మకథ అని డా॥ చెన్నయ్యగారు అంటే.. ఆమెది ఒక సంపూర్ణమైన, విజయవంతమైన జీవితమని విజయభారతిగారు అభిప్రాయపడ్డారు. స్ఫూర్తినిచ్చే అమృతలతగారి ఆత్మకథ అని వారణాసి నాగలక్ష్మి గారంటే.. సింప్లిసిటీకి మారోపేరు! అంటూ నళిని ఎర్రాగారు కొనియాడారు.




ప్రతులకు: డా॥ అమృతలత
విజయా హై స్కూల్, ముబారఖ్‌నగర్,
నిజామాబాద్-503 003 సెల్: 9848868068

ఆమె విజయపథం తన నవంకాలికులకూ.. భావితరాలకూ గొప్ప నవ జీవన మార్గాన్ని చూపే రోడ్‌మ్యాప్ అని డా॥ కె.బి.సంధ్యా విప్లవ్ అభివర్ణిస్తే.. నిజంగా ఆమె జీవితం ఏకాంత బృందగానమేనంటూ వి.ఎస్.యమ్. లక్ష్మిగారు రాశారు- ఆద్యంతం విభ్రమం అని తుర్లపాటి లక్ష్మిగారు వ్యాఖ్యానిస్తే.. స్త్రీ సాధికారతకి నిలువెత్తు నిదర్శనమని ఆర్. శశికళగారు ప్రశంసించారు.

ఆమె చాలా విషయాలను సులభరీతిలో, సరళ వచనంలో పాఠకుల హృదయాల్లోకి చేరుకునేలా రాశారనీ.. ఇందులో ఒక ధిక్కార స్వరం.. ఒక సంయమన శీలన ఉందనీ.. విజయ పథంలో నడిచే స్త్రీ చైతన్యం ఉందని డా॥ కొందపల్లి నీహారిణిగారు రాస్తే.. ఇది అమృతలతగారి ఒక్కరి కథ కాదనీ.. స్వాభిమానంగల మహిళలందరి బృందగానమని మందవరపు హైమవతిగారు కొనియా డారు. స్ఫూర్తిని నింపే జీవిత చరిత్ర అని ఎనిశెట్టి శంకర్‌గారు పేర్కొంటే.. పాఠ్యాంశంగా చేర్చాల్సిన ఆత్మకథ అని జ్వలితగారు కొనియా డారు.

నాటకీయత లేని ఆత్మ కథ అని శ్రీదేవి మురళీధర్‌గారు వ్యాఖ్యానిస్తే.. ఆ పుస్తకం నిలువెత్తు నిజాయితీకి నిలువుటద్దమంటూ గోలేటి లలితా శేఖర్‌గారు తమ సమీక్ష రాశారు. ఆమె ఒక ఉద్వేగం.. ఆమె ఒక భావ తరంగ వీచిక అని డా॥ గడ్డం శ్యామల గారంటే.. అక్కేపల్లి నిర్మలగారు అమృతలత యొక్క అసాధారణ వ్యక్తిత్వాన్ని తమ సమీక్షా వ్యాసంలో ఆవిష్కరించారు. మీ జీవిత చరిత్రను నేటి తరానికి పాఠ్యాంశంగా పెట్టాలని ఆకాంక్షిస్తూ డి. వందనగారు రాస్తే.. ఆమె ఓ తపస్విని! అంటూ జలంధరగారు కొనియాడారు.

అందరికీ ఆదర్శంగా నిలిచే ఒక దారి దీపం ఆమె! అంటూ జె. వరలక్ష్మిగారు ప్రశంసిస్తే.. స్థిత ప్రజ్ఞతకు మరోపేరు అమృతలత అంటూ దాస్యం సేనాధిపతి తమ సమీక్షా వ్యాసాన్ని తీర్చిదిద్దారు. అందరూ చదివి స్ఫూర్తిని పొందదగిన గ్రంథమిది అని దాస్యం అభిప్రాయపడ్డారు.

ఎన్నో వైరుధ్యాల చిక్కు ముళ్ళను విడదీసుకుంటూ.. ఏమాత్రం నల్లేరు మీద నడక కాని గమనాన్ని ప్రగతి బాటలో నడిపిస్తూ, ఎంతో ఓర్పు నేర్పులతో, సహన సంయమనాలతో వ్యూహాత్మకంగా నడిపిస్తూ పోవడం ఆమె ఉత్కృష్ట జీవన విధానానికి చిహ్నమని అనిశెట్టి రజితగారు అభిప్రాయపడితే.. స్ఫూర్తిదాయక స్వీయ చరిత్ర అని గుడిపాటిగారు ప్రశంసించారు.అమృతలతగారి జీవన గమనంలో విస్తృతి, వైశాల్యం ఉన్నాయనీ.. తన జీవితాన్ని సృజనాత్మకంగా మలచుకోవడంలో సఫలమయ్యారని గుడిపాటిగారు పేర్కొన్నారు.

అరుదైన స్త్రీమూర్తి అమృతలత అని డి.ఎం. అనలకుమారిగారు అభినందిస్తే...కొన్ని ఆమెకే చెల్లు అని పిన్నమనేని ఇందిరగారు వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీదేవిగారు అమృతలతను మానవతా మూర్తిగా అభివర్ణిస్తే.. ఎంతో మంచి కుటుంబ సభ్యులను, ఎంతో మంచి మిత్రులను, ఎంతో చక్కని వ్యక్తిత్వం వున్న పుత్రికను పొందిన ఆమె ధన్యురాలని కొనియాడుతూ సమ్మెట ఉమాదేవిగారు తమ సమీక్షను తీర్చిదిద్దారు.

"నా ఏకాంత బృందగానం' ఎన్నో జీవితాలకు స్ఫూర్తిగా నిలుస్తుందనీ చదువరుల హృదయాల్లో బృందవనాన్ని సృష్టించి.. మనసులను మురిపించి.. వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని డా॥వాణిదేవు లపల్లిగారు రాస్తే.. సుమనోహర దృశ్యకావ్యం అని వి.కె.భారతిగారు పేర్కొన్నారు.

మెరుగుపూతలు లేని ఆత్మకథ అని సాయిపద్మ గారు వ్యాఖ్యానించారు .కిరణ్‌బాలగారు పేర్కొన్నట్లు..నవ్వులు పూయించి.. ఆర్ద్రతతో తడిచేసి.. హృదయాలను కదిలించే ఈ ఆత్మకథకు పాఠకుల హృదయ స్పందనలే ఈ బృందగానం ఇలా అమృత లతగారి ఆత్మకథను సమీక్షిస్తూ వచ్చిన వ్యాసాలను "బృందగానం" లో చక్కగా పొందుపరిచారు. ఇప్పటివారికే కాక.. ఎప్పటికీ ప్రేరణనిచ్చే గ్రంథమిది! అరుదైన వ్యక్తిత్వంతో.. సమాజంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న అమృతలతగారికి శుభాకాంక్షలు తెలియజేద్దాం.



- దాస్యం సేనాధిపతి
సెల్:9440525544

# మిత్ర ప్రబోధ సహితం - మిత్ర లాభం

పుస్తక సమీక్షలు

ప్రపంచ సాహిత్యానికి మన దేశం అందించిన గొప్ప రచనగా పేరొందినది విష్ణుశర్మ పంచతంత్రం. సంస్కృత భాషలో రచించబడిన ఈ గ్రంథం ఎన్నో ప్రపంచ భాషల్లోకి అనువదించబడింది. విష్ణుశర్మ తన వద్ద విద్య నేర్చుకోవ దానికి వచ్చిన విద్యార్థుల కోసం పాఠ్య గ్రంథంగా ఈ పుస్తకాన్ని రచించారు. ఇది చిన్న చిన్న నీతి కథల సమాహారం. ఇందులో పాత్రలన్నీ జంతువులే అయినా అవి మానవ జీవితానికి అవసరమైన ఎన్నో నీతి సూత్రాలను, ధర్మాలను అందిస్తుంది. విషయ పరిజ్ఞానము, బోధనా సామర్థ్యం, చక్కని పాఠ్య ప్రణాళిక ఉంటే ఆసక్తిలేని, చదవంటే ఇష్టంలేని వారిని కూడా విద్యావంతులను చేయవచ్చని, వారికి చదువు పట్ల ఆసక్తిని కలిగించవచ్చని విష్ణుశర్మ నాడే నిరూపించాడు. పంచతంత్రం లో సామాజిక వ్యవస్థ, మానవ ధర్మం, నైతిక విలువలు తదితర విషయాలు మిళితమై కొనసాగాయి. ఇందులో ఐదు భాగాలున్నాయి .అవి మిత్ర భేధము (మిత్రులను విడదీయడం) మిత్రలాభము (మిత్రులను సంపాదించడం) కాకోలూకీయము(కాకులు, గుడ్లగూబలు) లుబ్ధ నాశము (సంపదలను కోల్పోవడం) అసంప్రేక్ష్య కారిత్వము (బుద్ధిహీనంగా చర్య తీసుకోవడం, చెడు చేయకోరడం).

చిన్నయ్య సూరి పంచతంత్రంలోని మిత్ర లాభం, మిత్రభేదం రెండింటిని తెలుగులోకి అనువాదం చేశాడు. మిగిలిన భాగాలను కందుకూరి వీరేశలింగం పంతులు రచించారు.

పద్య కావ్యాలను వచనకావ్యాలుగా రాయడం సులభమే. కాని వచనములో ఉన్నదాన్ని పద్య రూపంలో వెలువరించడం కొంత కష్టసాధ్యమైన విషయం. అయినా కీర్తిశేషులు గుండవరం చంద్రశేఖర రావు గారు ఉపాధ్యాయులు, తెలుగు బోధించిన పండితులు, పద్య రచన పట్ల అమితమైన ప్రేమ కలిగిన వారు కనుక ఈ సాహసాన్ని వారు చేయ గలిగారు. కావ్య సాంప్రదాయాన్ని పాటించిన చంద్రశేఖర రావు గారు వినాయక స్తుతితో ప్రారంభించి

**"పరవస్తు చిన్నయార్యుని**
**సురమునిగా నేదలంచి స్తుతి జేతునిలన్**
**వరవచన దివ్య కావ్యము**
**వరువవముగా పద్య కావ్య పథమున వ్రాతున్"**

అని చిన్నయ్య సూరిని సురమునిగా మనమున తలచుకున్నారు.

మాతృ స్తుతిలో...

**"శ్రీ భువనేశ్వరీ కృప కరామలకంబున దివ్య తేజమున్**
**నీ భువియందు కాంతిమతివై వెలుగొందితివమ్మ"** అంటూ తన తల్లిని ప్రేమగా తలుచుకుంటూ

"కృతినిదె గొని దీవెనలిమ్ము తల్లిరో "యని తన ప్రేమను ప్రకటిస్తూ తల్లికి ఈ కావ్యాన్ని అంకితం ఇచ్చినట్లుగా మనం గ్రహించవచ్చు.

గుండవరం చంద్రశేఖర రావు గారి ప్రబోధ నిర్వచన నీతి చంద్రిక మిత్రలాభములో పద్యాలు కమ్మెచ్చులో సాగిన తీగలా కొనసాగడం మనం గమనిస్తాం. వీరి పద్యాలలో నేటి సమాజానికి అవసరమైన సూక్తులను, సుభాషితాలను విరివిగా పలికించారు. వృత్త పద్యాలతోను, దేశీ చందస్సులతోనూ రచించిన పద్యాలను సందర్భోచితంగా ప్రయో గించడం ఆయనకు బాగా తెలుసు. అంతేకాక భాషా సౌందర్య మెరిగినవారు.పదాల కూర్పుతో పద్యాలను అలవోకగా నడిపించారు. అలంకారాల ప్రయోగం పఠితులను ఆకర్షింపజేసి పఠనాన్ని కొనసాగేలా చేస్తాయి.

"ఊరు పురంబుల కంటెను
దారుణ కారడివి మేలు అది యెట్లన్నన్
క్రూరము తోడుత జీవుల
మారణ హింసలను జేయ మానరు నరులున్"

క్రూరమైన మనస్తత్వాలతో నిండనదీ మానవ సమాజమని, హింస మానని మానవ సమాజము కన్న దారుణ కారడివి మేలని తెలపడం నేటి పరిస్థితులకు అద్దం పట్టినట్లుగా ఉన్నది.

పావురములు వలలో తగులుకొనుట కథలో...

**"సంఘ బలంబు గాదె ధర సాహస కార్యము జేయబూనగా**
**సంఘటియించి నిట్టి దరి యందరమేకము తోడ నివ్వలన్"**

సమాజంలో ఐకమత్యానికి గల బలమును , విలువను ఈ పద్యంలో ఉద్ఘాటించారు. కలిసి ఉంటే కలదు బలము .అందరము కలిసి ఒక్క మారుగా ఈ వలతో పాటు హిరణ్యకము దరిచేరి వల నుండి బయటపడదామని చెప్పిన సందర్భం నేటి భారతీయులకు మార్గదర్శకం.

విద్య , సుగుణాలు,ధనము ఈమూడు ఉన్నవాడు సమాజంలో గుర్తింపబడతాడు,పేరు ప్రఖ్యాతులు వస్తాయని వివరిస్తూ...

**"విద్యయు సుగుణము ధనమును**
**సత్యముగా గలిగినతడే ధాత్రిన్ వెలుగున్**
**మిథ్యయే యది లేకున్నను**
**మధ్యముడౌ గాదె మూటి యందొకకటుడగన్"** అంటారు.

**"తాదినకెవ్వరి కివ్వక**
**భూధనులై లోభ గుణము పొందిక తోడై**
**నీ దినమందైనను పరు**
**లాధీనము గాక మానదా ధనమంతన్"**

బ్రాహ్మణుడు - నువ్వుల కథలో చెప్పిన ఈ పద్యము లోభిని గురించి విడమర్చి చెప్పింది. ఈ పద్యము ధనము కూడా పెట్టి ధర్మం చేయక అన్న వేమన పద్యాన్ని గుర్తుకు తెస్తుంది. అంతేకాదు మధురకవిగా పేరుగాంచిన నాళం కృష్ణారావు గారి కవిత

**"ఊరి వెలుపల పాడుకోనేరు చెంత**
**మనుజులెవ్వరు మనలని మారుమూల**
**గుట్ట చాటున లోతైన గోయి త్రవ్వి**
**పసిడి దాచెను పిసినారి ముసలి యొకడు"** జ్ఞప్తికి తెస్తుంది.

హిరణ్యక్షుడు వలత్రాళ్ళు తెంపగా బయటపడిన మృగము, లఘుపతనకము మంథరకము వాయసము తిరిగి వస్తున్న సందర్భంలో నుడివిన పద్యంలో వృత్యనుప్రాసాలంకార ప్రయోగం.

**"ఇంతకు మును వంతలు పడి**
**చింతలు తొలగంగ చెలగి యింతకు నీకీ**
**కంతలు బెట్టగ దేవుని**
**పంతము మరియేమి వింతలన విని ఖగమున్"** మరొక పద్యము బ్రాహ్మణుడు-నువ్వుల కథలో...

**"అబ్బురపడి తబ్బిబ్బై**
**యుబ్బరమగు రీతి కడుపునుబ్బగ నవ్వున్**
**దబ్బర నాపియు వనితయు**
**నిబ్బరమున నిట్టులనియే నిజపతి తోడన్ "**

**"ఆశించుము సుజనులదరి**
**నాశింపకు కపట కుటిల మానసి మైత్రిన్**
**నాశ దురాశై దలపగ**
**నాశంబును గాక నొందు నరయునె ధరపై "** ఆశ ఎలాంటిదో తెలుపుతూ సుజనుల మైత్రిని కోరుకోవాలని, దురాశ వినాశనానికి దారితీస్తుందని హితవు పలికిన పద్యమిది.

**"ఈర్ష్యయు శంకయు క్రోధమ**
**నార్శిత కార్యంబు పర ధనాకాంక్షత్వం**
**బర్సించ తగదు,మూర్ఖత**
**పురుషార్థికి తగునె భీతి పూర్ణతనొందన్"**

మనిషిలో ఏ లక్షణాలు ఉండకూడదో ఈ పద్యంలో చక్కగా వివరించారు. ఈర్ష్య, అనుమానము, క్రోధము, ఇతరుల ధనము పట్ల కాంక్ష తదితర లక్షణాలు మనిషిని అధఃపాతాళానికి తొక్కి వేస్తాయి.

**"వినయము లేని చోట తగవే పనిగలిగిన చోట యెప్పుడున్**
**మనమున గట్టి వెత్తి యనుమానము గల్గిన చోట నమ్మకం**
**బును గన లేని చోట వారు లోర్వని చోట నధర్మమున్నచో**
**టును నివి యుండరాదనియు నుర్వి వచింపగ విందు మిత్రమా"**

ఉండరాని, ఉండకూడని ప్రదేశములను పద్యములో కూర్చి మనకందించారు.అంతే కాకుండా

**"అతిథుల సేవింపు వారికపకృతి గలదే"**
**"ధర జీవులకెళ్ళను కల్గు కష్టముల్ "**
**"ఇంచుక నీటి బిందువిది జీవితము"**
**"నిజ మైత్రిని వైరుల తోడ నెట్లగున్"**
**"కొఱగాని శంకలుడుగుము"**
**"మాటలు తేనెపట్టులటు మానస మున్ కాదు వేపవిత్తులు"**
**"దుర్విధిన్ దాటగా నకటా!దివ్యులకేని సాధ్యమే?"**
**"క్రమ్మర విడనాడు లోభకర గుణమతులన్"**
**"పురుషార్థికి తగునె భీతి పూర్ణతనొందన్"**
**"ఆశించుము సుజనుల దారి"**

మొదలైన సుభాషితములు సామెతలు వాస్తవ విషయాలు ఎన్నో ఈ గ్రంథములో చోటు చేసుకున్నాయి .

వ్యక్తిత్వ వికాసమునకు, ఉత్తమమైన జీవితాన్ని గడుపుటకు,నైతిక విలువల అనుసరణకు ఇంతకన్నా ఏమి కావాలి? మిత్ర లాభమనే ఈ కావ్యము మిత్రుని వలే హిత బోధ చేయుచు సన్మార్గ పథమునకు వెలుగులీను దారి దీపమువలె నుపకరించుననుటలో సందేహము లేదు. కీర్తి శేషులైన గుండవరం చంద్రశేఖర రావు కీర్తిని అచంద్రార్కము నిలుపుతందీ గ్రంథరాజము. ఇది నిస్సంశయం.



- డా.వైరాగ్యం ప్రభాకర్
సెల్:9014559059






ప్రతులకు :గుండవరం ప్రభాకర్ రావు
సెల్: 9949267638




నగరం రోడ్లు
తల్లి లాంటివి
ఆమెకు
పురుడు పోసాయి మరి!

జయాపజయాలు
ఒకప్పుడు దైవాధీనం
నేడు
ధనాధీనం..

భూగోళంపై
ఆకుపచ్చని దుప్పటి
రైతన్నల
చేతులకే సాధ్యం!

ఆనాడు సీతకు
అగ్ని పరీక్ష..
నేటి స్త్రీలకు
జీవితమే శిక్ష..!

ఇపుడు
పోరాటాలన్నీ విలువైనవి
ఆస్తులకోసం
అందలం కోసం.

జీవితమంటే
ఒకరు చెపితే తెలిసేది కాదు
అనుభవమే
అంతిమం!

పగిలిన అద్దం
అతకదు..
బతుకు తత్వం
అర్థం కానట్లే..

నగరంలో
సముద్రం లేకుంటేనేం?
వాన పడితే చాలు
మోరీల ప్రవాహం.

బతికుండగా
భార్యకు లేదు విలువ
పోయాక
ఆమె పేరుతో పురస్కారం

బాడుగ ఇంటిలో
ప్రాణం పోకూడదట
ఆత్మ బంధమంటే
ఇదేనేమో మరి..!

మేఘాలొచ్చాయని
విత్తనాలేస్తే
పంట చేతికొచ్చాక
పట్టుకు పోయింది



-శైలజామిత్ర
9290900879

### మాయ జలతారు

మనసే కాదు మాయ
మనిషి కూడా.
సంఘానికి గుడ్డిగా విన్నదే రుచి కాబోలు
ఒకే ఒక్క మాట
నమ్మకమై బుర్రను తొలిస్తే చాలు
దాని పునాదుల్లో దూరి
దుమ్మును విధిలించి
అద్భుతాలను రచిస్తుంది.
అమాయకత్వాన్ని ఆకర్షిస్తుంది.
కథలతో పక్కలో చేరి
పాటలతో జోకొడుతుంది.
ఒంటి నిండా రంగుల దారలతో
భావాలు వరదాలా పారి
బడి కొట్టుకు పోతుంది.
పలక మనసు పగిలి
దారి తప్పిన ఆలోచనతో
జ్ఞానం మౌనంపట్ల
కాలం మూగపోతుంది.
అబద్ధానికి బలం పెరిగి
దానికి అజ్ఞానం తోడై
వింతారాధన మేధావిది కావడంతో
నిజం ఉరిపోసుకుంటుంది.
నిజాన్ని కాపాడవలసిన
చదువెక్కడకి పోయిందో ?
తెలివెక్కడ తప్పిందో?



-చ నా రా
9704437347

### జగనంతా కుటుంబం

ఉషోదయం ఇంకా
ప్రభాతగీతాన్ని ఆలపించనేలేదు
నిదురమబ్బుల్లోంచి
కలతనిద్రల్లోంచి
కునుకు తీయనేలేదు.
చంద్రోదయం ఇంకా
ప్రకాశింపనేలేదు
నిశిరాతిరి వేళలో
మిణుకుమిణుకుమంటున్న
చుక్కల మాటున
ఎక్కడో దాక్కున్నది.
నిశ్శబ్దరాగంలో
నిర్విరామ కాలంలో
నిశ్శబ్దరాత్రి
విలయతాండవం చేస్తుంటే
నిర్నిద్రగానంలో
శబ్దం నిశ్శబ్దంగా
దోబూచులాడింది.
జీవన నాదంలో
ఊపిరి ప్రవాహానికి
అడ్డుకట్ట వేసిన
అదృశ్య క్షణమేదో
మంకుపట్టు పట్టింది
మరణమృదంగానికి
విషాదం తాండవం చేసింది.
పేగులను మెలిపెడుతూ
గుండెలను పిండేస్తూ
ఒక్కో క్షణం ఒక్కో యుగంలా
గడుస్తున్న తరుణంలో
కలా నిజమా అన్నట్టు
క్షణక్షణానికి ఊపిరి బిగబడుతూ
బతుకుజీవుడా అంటూ
వేవేల దేవుళ్ళకు మనసులోనే
వేనవేల దండాల ప్రార్థనలు.
ఆశ నిరాశగా ధ్వనిస్తూ
స్వప్నం చెల్లాచెదురైంది
కాలం నుదుటి మీద
ప్రాణం గాలిలో దీపమైంది
మనసు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ
గాయపడిన దేహం ముక్కలైంది
ఏమిచేయలేని నిరాసక్తత
చేతుల్ని కట్టిపడేసింది
కాలం నిశ్చలమైంది.
అనురాగానికి చిరునామాగా నిలుస్తూ
చిరునవ్వులకు ప్రతిరూపమై భాసిస్తూ
మా హృదయాంతరంగాల్లో
నీ జ్ఞాపకాలు మా మదిలో
ఎల్లప్పటికీ పదిలం
కాలం
గాయాలను మాన్పే లేపనం
కాలగతిలో జ్ఞాపకాలు సజీవం.
ఉదయాస్తమయాల జీవనసంధ్యలో
జననమరణ జీవన చదరంగంలో
జననం ఒక ప్రభోదయగీతం
మరణం ఒక హిందోళరాగం.
బతుకు ఇప్పుడు జీవనసమరం
బతుకు ఇప్పుడు పడమటి సంధ్యారాగం.
జననం ఒక వినోదం
మరణం ఒక విషాదం
జీవితం ఒక ఆశాదీపం
జ్ఞాపకం ఒక సజీవచిత్రం
ఇప్పుడు నువ్వు లేవు
నీ జ్ఞాపకాలు మాత్రం సజీవం
ఇప్పుడు నీ చిరునవ్వులు లేవు
నీ తీపిగుర్తులు మా మదిలో భద్రం



- డా. భీంపల్లి శ్రీకాంత్
9032844017

# ఈ. రాఘవేంద్ర రాసిన "కల్లంచుల బువ్వ" దీర్ఘ కవిత






-ఈ. రాఘవేంద్ర
9494074022

ఊరంతా
చప్పుడు
చేయని గువ్వై
మెలుకువ రెక్కలు
తెరవక ముందే
కళ్లల్లో నిద్రని తుడిచి
కడుపుసంచిలో
ఉత్తపేగుల్ని తడుముతూ
ఈదుల్ని దారితాడుతో
చేదుకుంటూ
యింటి నుండి మొదలైతుంది
మా నాయన పయనం
పాదాలకంటిన మట్టిలా
తెరలు తెరలుగా
చీకటి జారిపోతుంటుంది
ఆయన అడుగుల్లోంచి
కనికరాళ్ల పొడితో
చిల్లకట్టికి సానపట్టిన
కత్తి గొడ్డలి
పార ఉలి తో వనం గట్లపై
నడిచేపడవ తను
తాటి చెట్టు కింద
చేరిన బుద్ధుడై –
మా బతుకుబువ్వను దర్శించే
సూత్రాన్ని కనుగొంటాడు
ఆయన వూపిరి స్పర్శ
పసిగట్టిన చెట్లన్నీ
గౌరవ సూచకంగా
మబ్బుల దుప్పటిని మడతపెట్టి
గురువుముందు నిలబడిన
విద్యార్థులవుతాయి
రైతు పొలంలో
గుట్ట పుట్ట
గుంత కల్లాకంపా
ఊడ్చి అదనుకు
సిద్ధపర్చినట్లు –
చెట్టుతనువుకు పట్టిన
పురుగూ బూసి
దుమ్ము ధూళి
బరక బడికల్ని
అసను చేస్తాడు
కత్తి గొడ్డలితో ...
బీడిముక్కను ఎలిగించి
దీర్ఘధ్యానముద్ర నుంచి
బయటికొచ్చిన
మనిషిలా తేలికపడి
చెట్టుభాష ఎరిగినట్లు
ఆకుల రెప్పల పిలుపులందుకుని
గడపనుంచి గడపకు
వెళ్లినంత సులువుగా
ఉత్సవ దేహమై తేలిపోతాడు
మొదలు నుంచి కొసనకు
మా నాయన చేతులు సోకిన
చెట్లన్నీ
ఆనంద ముగ్ధమైనట్లు
తాడి చేతుల్లోని
మంచు బిందువులన్నీ
లయబద్దంగా అడుగులు
పడుతున్న
ఆయన తలపై
పూలవానై కురిసేవి
ఉత్తకడుపుతో మోకును ఎగేస్తూ
బరువునంతా చేతుల్లోనింపి
నడుముని ,
ముందరికాళ్ళ బంధాన్నీ
క్రమంగా కదుపుతూ
ఆయనలా చెట్టున ఎగసిపోతుంటే
తల్లి చనుబాలుకు ఎగబాకుతున్న
పసిపిల్లాడిలా అనిపించేది
తాను చెట్టెక్కే నేర్పరితనం
పర్వతారోహులకు
పాఠంలాంటిదే –
మబ్బులు తాకే చెట్టయిన
తన ముందు
సలామనాల్సిందే
మా నాయన చెట్టుపై నడక
భువి నుంచి నింగి ఎత్తుల్ని
కొలిచినట్లూ –
ఆకాశం ఆయన చేతికి
అందినట్లూ వుంటుంది
చలకత్తితో మట్టలను
తొలుస్తున్న శ్రద్ధ
వైద్యం చేస్తున్నట్లుగానే
వుంటుంది
మోకుతో పాకుతూ
పారతో చెక్కి
లొట్టికి మెలికకట్టి
ఉలితో గీయడం
ఏ పుస్తకాల విద్దెకు అందని
నేర్పరితనమే
చెట్టుమీద నిల్చిన మా నాయన
మా బతుకు
'దారిరెక్క' లాంటోడు
లేసిన గెలల కల్లు ఊటల్ని
తడుముతూ
గీత కత్తితో మెరల్ని తీసి –
వెన్నెల తుమ్మెదై చెట్టుపై
వాలినప్పుడు
చెట్టు పొదుగులు పితికి
బొట్టు బొట్టుగా కుండలోకి
అమృతాన్ని ఒంపుతాడు
కుండనిండా
కల్లు తొలుకుతుంటే
ఆయన ముఖం
చుక్కలు కాసిన ఆకాశమయ్యేది
కల్లు నిండిన లొట్టి
చెట్టు నుంచి దింపుతుంటే
ఆ రోజు మా యింటి
పంట పండినట్లుండేది

వానొచ్చినప్పుడు
మాయింటి చూరల్లో చినుకులు
వుటకలు కడతాయేమో కానీ
చెట్టు సుడిలో నీళ్లుదిగినా
కల్లు కుండలోకి
చుక్క కట్టనీయని మానాయనది
గొప్ప ఇంజనీరు నైపుణ్యమే
మసక తుండుగుడ్డును తెంపి
చెట్టు నుంచి దిగుతూ దిగుతూ
ఊరిదాక చేతుల్లో తెల్లపొద్దును
మా కడుపున మెతుకు మూలవాసాన్ని
కల్లంచలు కట్టి కాళ్లరిగేలా
మైళ్ళు దూరం వెంటేసుకొచ్చే
భగీరథుడు
గాడిదపై కల్లు నింపిన
రెండు చర్మంతిత్తుల్ని
తగిలించుకుని
ఆ వెనుకాల నడిచొస్తుంటే
మా నాయన రాజులాగా అనిపించేది !
అవ్వ చెప్పిన
'రాజు తెచ్చిన బువ్వకథ' గుర్తొచ్చేది !!
××××
తాటిచెట్టల్లే
నల్లని ఛాయే కానీ
ముంజల గింజల్లోని
తె(స)ల్లని మనసాయనది
భూమ్యాకాశాల మధ్య
మూడువందల అరవైరోజులూ
ముప్పైఅడుగులెత్తున్న చెట్లపై
సేద్యం చేసిన కర్షకుడు
మోకాలిపైకి ఎగబీకినపంచి
కాయాన్ని కప్పిన బనీను
చెవిలో బీడీ
ఇల్లు,ఈదులు తప్ప
యితర ప్రపంచం తెలీని
నిలువెత్తు అమాయక నగ్నత్వం
బొబ్బులెక్కి గడుసుపడిన
మా నాయన చేతులు
నా శరీరము తడిమినప్పుడల్లా
మట్టిని ఒంటికి
పూసుకున్నంత పరవశమయ్యేది.
గెనం గట్లపై నడుస్తున్నప్పుడు
గుజి బంధం లేపిన
కాళ్ల పుందును పచ్చిక పుల్లలు
కొరుకుడు పెడుతుంటాయి
నడుము చుట్టూ ముత్తజు రాపిడి ,
వీపు పై మోకు రాకిన వాతలు,
చెట్టుకున్న బరకలు
తొడలపై రంపపు కోతలు
తనువంతా గాయాల కొలిమిలో
నుసిదేలుతున్నా
మా యింట్లో వెలిగే స్థిమితత్వపు
నిలువుకాళ్ల బుడ్డీ తను
అరిగిన రాయిలా ఎండాకాలం చెట్టు
అరికాళ్ళ కింద మంటలు రేపినా
వాన్ల కాలం బురదకయ్యల్లో నడకలా
తాడిపై అడుగులు జారిపోతున్నా
మా కడుపుల ఉడికిన
మెతుకుల పిడస తను
వనంపై పడిన వానరాలు
సుందరకాండలోని
మధువనం ఘట్టాన్ని తలపిస్తుంటే –
వనమంతా ఆయన వలయమై
చెట్టును, చెట్టుకు కట్టినకుండను
కాపాడుతూ
కోతులు గీకిన గాట్లకు శరీరం
ముళ్ళ కంచలపై పడి చినిగిన
గుడ్డపేలికయ్యేది
అకస్మాత్తుగా చెట్టెక్కిన కాడ
పురుగులు చీమలు
తేనెటీగలు
పసర పాముల రూపంలో
పెనుప్రమాదం మోసుకొచ్చినప్పుడల్లా
చావు అంచుల శ్వాసను ముట్టేస్తాడు
పాదాలకింది భూమి
తలకిందులు చేసే చాపలా
గాలిదుమారం విషపునాగై
బుస గొడుతూ –
ప్రతీక్షణం మృత్యుభయం
మా యింటి దేహారణ్యంపై
పొరాడుతుంటుంది
మరణం వంతెన పై నడిచే
విచ్చుకత్తుల విన్యాసం లాంటి
బతుకులు మావి
తెరచాప లేని పడవలా
గాలి అలల ఒడిదుడుకులపై
తేలుతూ వూలుతూ
వూపిరి తీగను పట్టుకు నేల
దిగడమంటే
ఓ సాహస యాత్రే
నేలకి నింగికి
నింగికీ నేలకు మధ్య సాగే
అలసటెరుగని మా జీవనపోరాటం
ఉచ్ఛ్వాస నిశ్వాసల్లాంటిది !
తాటిచెట్టు ఈతచెట్టు
మా జీవన మూలాధారం
గీత మా ఉనికి
మా అస్తిత్వం !!
సకల కులవృత్తులు
సహజీవన సమన్వయ తత్వం
బహుజన దృక్కోణం –
నాల్గు గుంజల్ని నాటి
కూడగట్టిన తాటికమ్మలతో
దడికట్టి
కల్లు పాకల్లిన గిజిగాడు
మా నాయన
కుమ్మరి వామిలోని మట్టిని
కండ్ల కద్దుకొని
తొట్టి లొట్టి ముంతల్ని
చేతబట్టి నడిచొస్తుంటే –
కుమ్మరి కిష్టయ్య బిడ్డల్ని
అత్త గారింటికి పంపినట్లుండేది
పాతవన్నీ విరమణ పొంది
కొత్త వాటికి స్వాగతం పలుకుతాయ్
ఇంటికొచ్చిన మర్నాడే నడువంచి
మా పనిలో భాగమైతాయ్.
లొట్టి తొట్టి ముంతల
ఇంటి పేరు మారి
మా యింటి వయితాయ్
మా జీవన ప్రతీక లైతాయ్ !
సుత్తిని పిడికిలి బిగించి
కొలిమి ముందర
ఉరిమే అగ్గితుఫాన్ కు ఎదురొడ్డి నిల్చే
కమ్మరి సుబ్బరాయుని దెబ్బకు
ఎంతటి ఘన లోహమయిన
ముద్దర్లు కడుతుంది
సమ్మెటయెత్తి కొట్టే
దెబ్బ దెబ్బకు
అప్రయత్నంగా నోట్లో రాల్చే శబ్దాలు
శ్రమగీత స్వరాల్లా వినిపించేవి
తంగిడి బొగ్గుల పొదలో

ఒదిగితేనే
'ఉలి' పలుకుతుంది
కల్లు కారుతుందనేది
మా పెద్దల మాట.
దాపగత్తి మారగత్తి
చలకత్తి గొడ్డలి గా
గీతకత్తులన్నీ సిద్ధపరిచి
మా నాయన్ని బతుకు యుద్ధానికి
యోధున్ని చేసేది సుబ్బరాయుడే!.
తొడలు అట్టుకట్టి ,
నార నలిపి
చేతులు కందిన కర్మయోగి మాదిగ మారెన్న



'మోకు ' బుకునీ ' నళ్లుతుంటే
బిడ్డకు జడలల్లిన తల్లిలా
చాలు దున్నినంత నేర్పును
కళ్ళప్పగించి చూస్తుండిపోయేవాళ్ళం.
బడిగే నిచ్చెన
వడ్ల నెర్సుకోల
పద్మశాలి బొంత
చేతి వృత్తుల
మమత సమతలకు
ఎన్ని మట్టి దండాలు పెట్టినా తక్కువే !
×××
అడివినంత గాలిస్తూ
నేలపాదాల్ని పలకరిస్తూ
గీత కత్తులకు
జవసత్వాలు పోసే చెట్టు వేర్లని
పసిగట్టి కోసుకురావడం
ఓ మర్మకళ.
ఊడుగుచెట్టు కుంకుడుచెట్టు
విషముష్టి చిల్లచెట్టు
వేర్లన్నీ ఆకురాయిలా
పనికొచ్చే సానకట్టిలే
మసికట్టి ,తీడుకోల
పిల్లబద్ద,చిరత బాద
సానకట్టికి పేర్లు
అగ్గిలోకేస్తే చిట చిటలాడే
తంపు ఆ చెక్కది.
కల్లు గెలల్ని తెగ్గోసే
నును తగిలే కత్తులన్నీ
మొద్దుబోయి మొండికేస్తే
మసికట్టి పై దోసెడు కనికరాళ్ల పొడిబోసి
నూరితే గరుకుపట్టినవన్నీ
మెరుపులద్దుకుంటాయి.
ఎగాదిగ నూరే వొరిపిడికి
కల్లు గింజల్ని రాల్చే కత్తులన్నీ
తెగ సురుకును కడతాయ్
పదును సంబరమయితాయ్.
సాన కట్టి దెంత గుణమో
అరిగీ అరిగీ
కరిగి ఇంకో దానికి
ప్రాణ వాయువవ్వడమంటే
మాటలా !
వనానిదొక
సమూహపు పాట ?
శేపుకొచ్చిన పొంగుల్లోని
పాడి ఆవుల్లా
గట్ల గిట్టల మింది చెట్లు
ప్రేమ జల తో బృందంగా
'గీత' రాగాన్ని పాడుతుంటాయ్
ఈదులంతా
తానై తిరుగుతూ మా నాయన
చెట్ల మధ్య నడిచే చెట్టయితాడు
వనంలోని చెట్లన్నీ మా యింటి
వెన్నపూసలవుతాయ్
మా ఆకలిని ఒద్దుకేయడంలో
మా నాయన కష్టమంత
చెట్టు దుఃఖమూ వుంటుంది
ఆయనొక్కడికే
పరిచితమైన లిపి రహస్యమన్నట్లు
తన స్పర్శానుభూతికి
ఒక్కొక్క చెట్టు మూన్నెల్ల కాలం
మా కడుపు నిండే
పిడికెడు ముద్దవుతుంది



ఈతచెట్టులో పోత,పెంట –!
తాటి చెట్టులో
పొద్దులు,పరుపుతాడు
పండుతాడన్నవి రకాలు
పోతచెట్టు,పెంటచెట్టు
గాలి ఆవిర్లతో
పరాగ సంపర్కం చెంది
పెంటచెట్టుకు పూసిన పూత
కాయలయితాయ్
పెంటచెట్టు,పరుపుతాడు
తల్లి గుణమున్నవి
కల్లు ధారగా పారుతాయి
పోత, పొద్దులు కొంచమైనా
సారమున్న కల్లే యిస్తాయి...
పండుతాడు పవిత్రమైంది
కాటమయ్య గుడికి ఎత్తేబోనం
పండుతాళ్లదే
మూడు దినాలు గీతెస్తే కానీ
కల్లు పారదు –
నీసు ఉల్లి ఆలినీ
ముట్టకుండా
సాపమిందే పనుకుంటూ
ఆ మూన్నాళ్లు గీతడు నిష్ఠ చేస్తాడు !
×××
తాటిచెట్టు ఈతచెట్టు
మా బతుకు
మూలధాతువొక్కటే కాదు
ఇంకో నలుగురికి
బతుకు తెరువు కూడా
మా కల్లంగడి పక్కనే
ఎరుకల అంజినప్ప చేతిలో
ఈత బర్రలు గంపలయ్యేవి
ఎరుకల గంగమ్మ
కాలుచేయి వేళ్లక్రియల మధ్య
ఈత సాపలు
పురుడు పోసుకొనేవి
మాసిట్లోళ్ల కష్టానికి
నారముడులు జతలుకట్టి
తాళ్లయ్యాయి
వ్యవసాయానికి పగ్గాలు
గండెరలు బావితాడులు
బీదబిక్కీ యిండ్లవాసాలు
గుడిసెలయ్యాయి
బడి ముందర
గేగులు ముంజలు ఈత పండ్ల గంపతో
నీలమ్మవ్వ
ఏరోజుటి కారోజు కడుపును
పండించుకునేది
వేల మందికి
ఈత తాటి చెట్లు
జీవనోపాధి మెతుకులయ్యాయి
తట్టలు బుట్టలు
పరకలు తడికలు
విసనకర్రల రూపంలో
ఉపాధి ఉత్పత్తులుగా –
మానవునికి
మొదలునుంచి కొనదాకా
చెట్టు దేహాన్ని మొత్తం
దానం చేస్తుంది.
తాటి ఈత చెట్లు
తమలోని ఒక్కొక్క
అవయవాన్ని ఒలకబోస్తూ
మా జీవితాల మెలుకువలో
జీవిస్తాయి !!
×××
తాటి ఈత గెలల్లో
స్రవించే పోషక ద్రవం
పులియకుండా సేకరిస్తే నీరా,
పులియబెడితే కల్లవుతుంది.
పొద్దుపొడుపు కల్లు తో
మండుటెండలకీ
పండు వెన్నెలల్ని పండించే
కమతమవుతుంది దేహం
సాయంత్రం కల్లు –
అలవాటు తనంగా
ఎండిన గుండెల్లో జీర్ణించుకొనే
ముంతపూల లేపనం
యల్లమ్మ పోలేరమ్మ
మైసమ్మ పోతరాజు

కాటమయ్య ఏపల్లె జాతరైనా
మొక్కులు చెల్లింపుల మొదటిది
కల్లు సాకమే
పండుగలు పెండ్లిళ్ళు
పంచాయితీలు చావుదినాలు
వేదనో వేడుకనో
కార్యమేదైనా
సామూహికంలో ప్రధానం కల్లు !
వొంటికి ,బలానికి
ప్రకృతి మూల బలవర్ధకం కల్లు
మలినం అంటని
ప్రకృతి సౌందర్యం !
కొత్త కుండ
కొత్తాకులు కట్టిన నీరా
కడుపును సాపు చేస్తుంది
పిల్లోళ్లకు పోసే అమ్మవారుకి
గుటక గుటక సత్తువ నిచ్చే
సంజీవినయితుంది.
తాటి చెట్టు తల్లి లాంటిది
ఈత చెట్టు
యిల్లు లాంటిదన్నది ప్రతీతి !

×××
మా తాత నాయకత్వ పడవ నెక్కి
వనం తీరం వెంబడి
మా నాయన, చిన్నాయన సాగగా –
కల్లుదుకాణం నడిపేది
మాయవ్వ , మా యమ్మ

గీతన్నల ప్రతీయిల్లూ
పనిలో – కష్టంలో –
ఆడమగ యిద్దరూ
సరళరేఖలు ,
సంసార పల్లకిని మోసే
రెండు భుజాలు !!
వనం నుంచి కల్లంగడి దాకా
యింటి నుంచి సంసారం దాకా
కష్టం నుంచి సుఖం దాకా
విభజన గీతలు లేని
నిర్మిత సజీవగూళ్ళు మాయిండ్లు !
××××
తాలెక్కడానికి
పరగడపన ఎల్లిన మానాయన్ని
ఎదురుచూస్తూ
మాయమ్మ గుండె
చెట్టుకొమ్మయి ఊగుతుంటుంది
వచ్చేదారికి ఆర్తిగా కన్నుల్నీ
బార్లాతెరిచి
కావలి
కాస్తూ –
మా నాయన
ఆమె కండ్లల్లో నిండేదాకా
జ్ఞప్తికొచ్చిన దేవతనల్లా
మనసు నిండుగా
కొలువు దీరుస్తుంటుంది.
ఇల్లు కల్లంగడి ఇరుసులో
పరుగులెత్తిన జీవనది మాయమ్మ
తొలి పొద్దు –
మలి పొద్దయి వాలినా
పొయ్యి ముందర
వాడని పువ్వుల కొమ్మ .
కల్లంగట్లోకి గుగ్గుళ్ళు
రొట్టెలు శాకనా చేస్తూ
మూడురాళ్ల పొయ్యికి అదనంగా
నాల్గో రాయిలా కాగిపోయ్యేది.
పాతిక మంది యింట్లోని
ఆకలి కడుపులకు
నవ్వుల చేతుల్తో సాదిన అక్షయపాత్ర
నేలకు పేగతికించుకొని
అందరిని ఒక్కటిగ చేరదీసిన
ఉమ్మడి వంతెన
అరవయ్యేండ్లకు చెయ్యాల్సిన కష్టాన్ని
ముప్పయ్యేండ్లకే మోసి
శరీరం నిండా గాయాల పుండ్లతీపుల
గాసిన చెట్టు
నాకు తెల్సిన నాగరికత
మాయమ్మే.
మసక మసక మడతల్ని
దులుపుకుంటూ
కల్లంగడి ముందు కొంతమంది
వానాకాలం సెలయేళ్లల్లా
రెక్కలు కట్టుకు వాలిపోయేవాళ్ళు
మానాయన వొచ్చే దావలో
ఆశగా కండ్లన్నీ పరిచి –
ముదులు విప్పిన వాళ్ల
మనోనాలుక
వచ్చే కల్లును ముందుగానే
రుచి చూస్తుంటుంది
అలికిడైన ప్రతీ చప్పుడు
మా నాయన అడుగులనుకొని ఆబగా
మేలుకొనే వాళ్ళ కళ్ళు –
కాకపోతే
నిట్టూర్పులకు లోనయ్యి
మళ్ళీ తేరుకొనేవి.
అల్లంత దూరంలో పొడసూపిన
ఆయన కిరణాల స్పర్శకు
బరువైన క్షణాల్లా
నడిచిన కాలం
దూదిపింజలా తేలికపడుతుంది.
కొత్త గాలిని
పీల్చుకున్న కమలాలై వికసించి
ఆ పూరేఖలపై గంతులేసే వెలుతురులా
వాళ్ల ముఖాలు విప్పారి
పిడచకట్టిన నోళ్లన్నీ పూటకట్టేవి.
పూడికతీత చెరువులో
నీళ్లు నిలిసినట్లు
నాలకపై లాలాజలమట్టం
అంతకంతకూ ఉప్పొంగుతుంటే
లొట్టిమీద
కల్లుపొంగు
వెన్నెల లావాయై పొర్లేది.
ఉబుకుతున్న పొంగు చూస్తున్న
వాళ్ల దేహాలన్నీ
ఆనందబీజాలు మొలకెత్తిన
క్షేత్రాలయ్యేవి !.

నుదిటిన రూపాయంత బొట్టు
కల్లుతొట్టికి రెండడుగులెత్తులో కూర్చునే
నిండైన విగ్రహం మాయవ్వ
మా బువ్వనంతా రాశి పోసినట్లుండేది

కల్లంగడంతా అలికి
గంధం దిద్ది,వేపరెమ్మల నలంకరించి
తొట్టినిండా కల్లు పోసినాక
మాయవ్వ చేతిలో
'తొట్టిపూజ' ముగుస్తుంది
తొట్టినిండిన కల్లు
పొద్దు కురిసినట్లల్లా

పిల్లాడి నోట్లో పీచు మిఠాయి లా
కరిగిపోతుంటుంది
సుక్క యింకిన ప్రతీ గుండె
నిజాలు పరుస్తుంది
తొట్టి ముందర ముంతల ముగ్గులా
మాటల గీతలు దిద్దుకుంటాయి
ఎడారి మనసుల్లోనూ మొగ్గలు కాస్తాయి.
బాధల్ని దుఃఖాల్ని
ఆనందాన్ని విషాదాన్ని
గుండెల మాటు మూగతనాన్ని



పెదవి దాటని మాటల్ని
కల్లు గుడిసె విప్పి కుప్పపోస్తుంది
ముంత ఎత్తిన వాళ్లంతా పడవలై
వాళ్ళని వాళ్లే తెడ్లుగా చేసుకొని
అందరూ ఒకే ఒడ్డుకు చేరిన
ప్రయాణికులవుతుంటారు.
కల్లంగడంతా
సెలయేర్లు నదులు
మేఘాలు చిరుగాలులు
తెరలు తెరలుగా ప్రవహిస్తుంటాయి
అక్కడ కాలుమోపిన వాళ్లంత
ఆ తెరల ఊయలలో
మునిగీ తేలి తడిసిన ముద్దలై –
పాకుడు తీగలుగా అల్లుకుంటారు
ఆ అల్లుకున్న తీగలెంట
పువ్వులై పూస్తారు
బీడు గుండెల చాలల్లో
సప్తవర్ణాలను దిద్దుకుని
పురివిప్పిన నెమల్లయి
అక్కడ్నుంచి
అలలు అలలు గా కదిలిపోతారు.
ఇళ్లకు చేరి
గుండెల్లోనూ బుర్రలోనూ
ఇరుకు ఇరుకుగా వున్నవన్నీ..
కూరుకుని
కుంచింప చేసేవన్నింటినీ జారవిడిచి
నిద్రకు రెక్కలిచ్చి
కలలు కలలుగా సంచరిస్తారు !
కల్లుముంతలో అరచేతులద్ది
ముంజేతుల్ని తడిపి
వియ్యంకులైయ్యే గ్రామీణాచారాలకు
సాక్షిభూతం కల్లంగడి
నీరా గొంతుకవాటాల్లో చేరంగానే
పోతన భాగవతపద్యాలు
ఆరున్నర శృతిలో అందుకున్న రాగం
కల్లుపాక తడికెల మునివేళ్ళ సందుల్లోంచి
ఆకాశాన్ని ముట్టేస్తుంటాయి.
సందులోని రాజకీయం నుంచి
ఢిల్లీ పీఠం దాకా
వాస్తు నుంచి శాస్త్రం దాకా
చర్చల రచ్చబండ –
ప్రక్రియలెన్నైనా పాత్రలు రక్తికట్టే
నవరస ఫల
రంగస్థలం కల్లంగడి.
మండువ అంటే
లోలోతు మూలాల్ని తడిమి
తవ్విపోసుకునే పూలపడవ
అలసిన తనవులు సేదతీరే
పరవశ క్షేత్రం !
మొర్రి గుబ్బ కల్లుంటే
మోచేయి మునగన్నం
ఎనకిటికి సామెత
నింగిదాకా ఎగబాకి ఈదిన
ఆకలి పేగుల్ని ఈతముల్లు తో
అతుకేసుకుంటున్నాం.
అలుపు లేకుండా
గొడ్డుచాకిరీ చేసినా
గింజకీ గుడ్డకి కొదువే.
సందకాడ
గల్లాతిత్తి గుమ్మరిస్తే
బోర్లాపడేది తొట్టిలో అట్టుకట్టిన మడ్డి
పండుగలు పబ్బాలప్పుడు
బీడీ బిచ్చం కల్లు ఉద్దర అన్నచందం –
తిరిపెం,ఇనాం లకే తొట్టి కల్లూ
తొర్రపళ్ళ సందుల్లో గాలి
సద్దుచేయక జారినట్లయితుంది.
కల్లు పోయించుకున్న ముంత
నోటికాడ పెట్టుకొని
ఒట్టి చేతుల దృశ్యాలవుతారు
లోలోన ముంచెత్తే దుఃఖసునామీలను
దిగమింగుకుని నిస్సహాయంగా రాలే



రేకులవుతుంటాం.
బొగ్గుతో గీతలేసిన
అప్పుల ముంతల లెక్కలు
దినాల్ల మసకపడి
చేతికందకుండానే చెరిగి పోతుంటాయి.
అప్పుల పోయకుండిన దినం
వాళ్ల కళ్ళు ఎర్రబడతాయి.
ఆ రాత్రి అదృశ్యంగానే
మా తొట్టినిండా పేడో,పియ్యో నిండుతుంది
ముంతలన్నీ బోకులు బోకులుగా
ఇరిగి పడతాయి.
అణిగి మణిగిన మాటలే ఉండాల
ఇయ్యాల్సిన అప్పునడిగితే
అన్నిదినాల మర్యాదను
మా గడపలోనే వదిలి
ఇంకో గడప తొక్కుతారు.
పోసినప్పుల ముంతలు
పైసల్ వసూలు చేయడమంటే

(మిగతా 4వ పేజీలో....)



(3వ పేజీ తరువాయి..)

ఎడారిలో చెలమ ఊటకు
ఎదురుచూసినట్లే
పప్పులు ఉప్పుల రేట్లు
నింగినంటినా
నిక్కర నుంచి ట్రౌజర్ వయసుదంక
యేండ్లు మారినా
ముంత మీద రేట్లు మాత్రం మొలవవు!!
ఒక్కోసారి కల్లంగట్లోనే
ముంతలు ఎక్కువై
వాళ్ళ నోట్లో రాల్చిన కక్కపై
మన్నొకటి పోసిపోతే
కస్మాలాన్ని శుద్ధిచేసే
పారిశుద్ధలమయితామ్
దినమూ ఈడకొచ్చేవాడు
పొద్దంతా కనిపీయకుంటే
మొదట జవాబుదార్లం మేమైనట్లు
ప్రశ్నలన్నీ మమ్మల్ని
గురి పెడుతుంటాయి.
కల్లంగట్లోనో పాక ముందో
దావలోనో దుమ్ములోనో
అదుపుతప్పి నేలబడిన ఒడల్ని
ఇంటికిచేర్చే దివిటీలం.
దొంగల బెదదకు
ప్రతీ రాత్రి మావి నిద్రిడిసిన
జాగరణాలే –
ఆదమరిస్తే చెట్టు మింద
కల్లు కుండ్లు మాయమైతాయ్
చిల్లరగాళ్ళు ఇసిరే
రాళ్ళ దెబ్బలకు కుండ
ఇంతింత పెద్ద బొక్కల కండ్లేసుకొని
మా ఏడుపును కూడా
అదే ఏడుస్తూ
మట్టిలో క(ల్లు)న్నీటి గీతాలు దిద్దుతుంది !
జరమొచ్చినా జలుబొచ్చినా
కడుపంతా వుండ చుట్టుకున్నట్లున్న
ఆకలిగండం గట్టెక్కడానికి
ఈత చెట్టుకు మేము
చిరిగి చిక్కుకున్న పతంగమవ్వాలి
ఊపిరి చేద బొడ్డుతాడులా
తెగిపోతున్నా
ఎండిన డొక్కలు పండించుకోడానికి
వేలతుఫాన్ల ఒరుపును తట్టుకుని
తాటి చెట్టుకు మేకై
గుచ్చుకు నిలబడాల్సిందే !.

దున్నేవాడిదే భూమనట్లు
గీసిన చెట్టు పై
మాకు హక్కుంటే బాగున్ను
ఏండ్ల కొద్దీ పారాడిన
అదే నేల అదే దారెంటా
తనే నేలై దారే తనై సాగుతుంటాడు కానీ
గజం భూమికి
పేగు ముడేసుకున్న చెట్టుకు మానాయన
హక్కుదారుడు కాదు
చెమటలు
తడిపిన ఈదుల్లో
మేము
ఎప్పటికీ
ప్రవాసీలమే
కండ్లల్లో వత్తులేసుకు
కాసిన వనం
పరాధీనసీమే.
ఇంకోడి దయాదాక్షిణ్యాలపై
బతుకెల్లదీస్తూ ఎప్పుడైనా
ఖాళీచేయాల్సిన
అద్దింటి పరాయితనం.
గీసిన్నాడు
గీయకున్నాడు లెక్కలు చూడదు
నెల తిరిగిందంటే కామాందుకు
రొక్కం మూటగట్టీయాల్సిందే .
అదును చూసి
భూస్వాములు చెట్టుపై
అదనపు రుసుముల తెరలేపి
మా శ్రమను దోచే పరాన్నభుక్కులు.
గుత్త కట్టందే
చెట్లు ముట్టనీయరు
కంపల కంచెల్ని పేనుతారు.
ముళ్ల ఊచలు మధ్య
ఖైదు చేసిన చెట్టును చూసి
మా నాయన గుండె
పిగిలిపోతుంటుంది
తల్లి దూరమైనంతటి శిశువు దుఃఖం.
కాదు కూడదన్నామో
చెట్లన్నీ నిలువెల్లా నిప్పులు కక్కుతూ
ఆసామి రచించిన అగ్నికాండకు
మా గీత బతుకులు
బూడిద పాలవుతాయి.
సొంత నేల,
పెంచుకునే చెట్లని
రాజ్యాలిచ్చిన జీవో ల కోసం
జీవం రాలిన కళ్ళతో దశాబ్దాలుగా
ఎదురుచూస్తూ మిగిలిపోయాం !



×××

తరాలుగా సాగిన
'వేలం పాట '
దొరలస్వామ్యం
పైచాచిక ఆటలోంచి తిరుగుబాటుతో
బయట పడినం కానీ
సొంత సొసైటీలొచ్చి
మా కులపుదొరల కలుపు మొక్కలు
నీడలు పరుచుకుని
వాళ్ళ మోచేతిల కింద నీళ్ళల్లా
రెప రెప రాలిపొయ్యాం
ఎండకు జరిగి
నీళ్ళల్లో పడి
సచ్చినట్లయింది మా బతుకు.
వృత్తి చేయని వారి
గుత్తాధిపత్యం తో
సహకార సంఘాలన్నీ
ఉత్తిత్తి సౌధాలయ్యాయి.
సాధక బాధాల్లో చెయ్యందించే
సమూహం కాకుండా
మా చెమటొలికిన రూపాయిని
పీల్చేసిన జలగలు.
చేతిలోని ఒక వేలే మనకంట్లో
బాకై గుచ్చుతుంటే
ఒకానొక శూన్యపు రెక్కల కింద
చలి చీమలపై ఒదిగి –
మా కులనాయకుల
రాజకీయ ఎదుగుదలకు
మేము నిచ్చెన మెట్ల పుల్లలుగా
ఒరిగిపోయాం.
×××

చెట్టు జీవమే మా జీవనం



చెట్టంటే
మా యింటి పంట
నిలువెత్తు పండిన బువ్వకుండ
తట్టాడుతున్న గద్దనుంచి
పిల్లల్ని కాపాడుకొనే
తల్లి కోడిలాగా చెట్టుని రక్షించేకి
తండ్లాడుతుంటాడు మా నాయిన
మొగిపురుగు
చెట్టు తనువంతా
తారాడి తారాడి
మొగిలో చేరి
మా కడుపులో చిచ్చు పెడుతుంది
చెట్టు నుంచి చెట్టుకు చేరి
మొగిలో రసాన్ని జుర్రి
కల్లు దిగుబడి కుదేలై
తాటి ఈత చెట్లన్నీ
యింకిన దిగుడు బాయిలయితాయ్
తలలు తెగిన మొండెంతో
వేలాడుతూ చెట్లన్నీ
అస్థిపంజరపు బొమికలై
మా గుండెల్లో తూట్లు పడతాయి.
సారం లేని
మందులెన్ని కొట్టినా
పురుగు చిద్విలాసాన్ని ఆపదు
ముక్కు పుటాలానికెక్కిన
నాయన మాత్రం
జరం తో మంచమెక్కుతాడు.
పురుగుల్ని
తినాల్సిన మందులు
మనుషుల్ని తింటాయ్
నెత్తుటి కన్నీళ్లను కురిపిస్తాయ్.
గీత బతుకుల జీవాన్ని
ఒట్టిగజేసే మొగిపురుగు
నివారణ మందులేని
మా ముంత పిడసకు పట్టిన రోగం.

ఓ రోజు
అబ్కారీ పోలీసులు
పరీక్ష నాళికలతో వచ్చి
తొట్టిలోని కల్లు పరిశీలన చెయ్యకుండానే
ఆ రోజు అయినకాటికి పైసలన్నీ
గుమ్మరించుకెళ్లారు.



ధారలుగా రాలిన
మా స్వేదాశ్రువుల ఫలాల్ని
పుక్కిట రసంగా జుర్రుకున్నారు.
తీసుకుపోయింది పైసలుకాదు
ఆ రోజుటి
మా తట్టలోని జీవగంజి ని ?
వున్న మెతుకుల్ని
మా కడుపున రాల్చి
అవ్వాతాత నీళ్లు నింపుకున్న సముద్రాలై
ఆకలి దిగుల్లని వుగ్గబట్టి
రెప్పలకింది యిసుకగూడులో
ఆవిరిచేశారు.
వృకాసురుని హస్తభస్మం నుంచి
పరమశివున్ని
సురాభాండంలో దాచి కాపాడిన
మా ఇల్లాలు 'గౌడచండిక' –
గౌడపురాణంలో అపాయాన్ని
తప్పించబోయి నిందమోసిన
'సురమాంబ'
అగ్నిపరీక్షలో పునీతమైనట్లు ?
కల్లుపాక ముందు
అబ్కారీ పోలీసులు నిలబడిన
ప్రతీసారీ 'శీలపరీక్ష'కు
మేము సిద్ధపడాలి !
మాపై 'కల్తీకల్లు' మాటలు
అవమానాల ముల్లై
గుచ్చుతుంటుంది
మా స్వాభిమానాన్ని ముక్కలు
చేసేకుట్ర జరుగుతుంటుంది.
దళారీలు
మా వృత్తిలోకి చొరపడి
మా వృత్తి మాది కాకుండా
చేసిన రోజే
కల్లు వ్యాపారం అయ్యి
ముంతలోని కల్లు
సీసాల్లోకి సాదారు
దళారీల దాహానికి
బలిపశువులం మేము
కల్తీలు చేసేది వాళ్ళయితే
మా భుజాలపై బురదను చల్లి
కల్తీ కులమని
మాపై నింద మోస్తారు
కల్లంగడి పట్టాలోని
పేరుమాదే , కానీ
పెత్తనం మాది కాదాయే
అంతా భౌతిక
ఆక్రమణ వలస వాదమే.
గీసేది మేము ,శ్రమ మాది
అగ్రకుల దళారీ
మృత్యుహస్తాల్లో చిక్కి
మా కల్లంగట్లోనే మేము
నేడు దినసరి కూలీలం !

పందిరంతా
సందడైనట్లున్న కల్లంగడి
వసంతంరాలిన కొమ్మ మీద
ఎడారి పిట్టలా
దిగులు దుఃఖం తొడిగింది.
కైపెక్కే మద్యం
గాజు సీసా అంచుల రాపిడికి
కల్లుముంత ఊపిరాడక
విల విల గింజుకుంటోంది.
మద్యపాన నిషేధం
మాటలుగానే మిగులుతూ
అనధికార బెల్టుషాపులు
మా కుతికిలకు ఉరితాళ్ళయ్యాయి.
మద్యందార్ల జేబుల్లో మునిగిన
అబ్కారీ బూటు కాళ్ళ కింద
మా ముంతల పీకలు
నలిగి పోతున్నాయి.
కల్లు ను అబ్కారీ నుండి
మినహాయించాలన్న మా కోరిక
కంచికి చేరని కథ గానే
మిగిలిపోయింది.
పుట్టల్ని ఆక్రమించిన పాముల్లా
లిక్కర్ మాఫియా గద్దలు
మా కనుగుడ్లు పీకి
వాళ్ళు కన్నులు చేసుకున్నారు
మా చేతులు నరికి
వాళ్ళు రెక్కలు తొడిగారు
మొత్తానికి
మా బతుకుని హత్యచేశారు !
పాలకులే మద్యం అమ్మకాలు చేపట్టి
మేము పెనం మీద నుంచి
పొయ్యిలో పడ్డానీ !!

××××
కసాయి కత్తి కింద
తల బెట్టినట్లు
విస్కీ బ్రాందీ
మాయదారి
మత్తు అగాథఅలజడిలో
నుజ్జునుజ్జవుతున్న
కుటుంబాలు లెక్కలేనన్ని !
అడ్డుచెప్పే పెండ్లాంబిడ్డల్ని
మక్కిలిరగదన్నైనా
ఇంట్లో నుండి పట్టుకొచ్చే
పొలం పట్టాలు , పెళ్ళాం పుస్తెలు
మద్యం కొట్లో తాకట్టు వస్తువులైన
వైనాలు చెప్పలేనన్ని !
మానవ వనరుల్నిబలహీనపర్చే మద్యం
కష్టజీవుల శ్రమఫలితం హరించి
నిలువునా కూల్చే
నిరంతర హంతక హింసాకత్తి –
దేహాల్ని లోహంగా కరిగించేసి
బడుగు బతుకుల్లో శవాలపంట



పండిస్తోంది !!
×××
కులవృత్తుల మైదానంలో
ప్రపంచీకరణొక మృత్యుక్రీడ
మా నిస్సహాయత దేహపు శవాలపై
రంగుతోరణాలు కట్టి
మా జీవన సంస్కృతిని దోచుకుంది
దాని నీలినీడల దుప్పటి కింద
తాటి ఈత కవలపిల్లలు
మొలకల్లోనే 'భ్రూణ హత్యలు'
కాబడుతున్నాయి
ప్రపంచీకరణ
విధ్వంసపుకాండకు
వృత్తుల జాబితాలో
' గీత '
రెక్కలు తొలుచుకుంటున్న నగ్నవృక్షం
గీతకార్మికుడు కొలువుజారి
ముందు వరుసలో నిలబడిన
నిరుద్యోగి
పట్టణీకరణమనే
కాన్క్రీట్ జంగిల్ భవనాల పునాదుల్లో
ఈదులన్నీ
సమాధికాబడ్డాయి
రింగ్ రోడ్డు వామనపాదాల
విఫణివీధిలో
చెరిపి చితికి తొక్కబడుతున్న
బలిచక్రవర్తి 'మా తాటివనం'
రియల్ ఎస్టేట్ దేగల పడగల కింద
వనం మట్టిదేహం తొలచబడి
బతుకు బీడైన
'మా గీతకార్మికుడు' ఓ శిబిచక్రవర్తి
నగరాల నుంచి పల్లె వరుకు
బహుళజాతి భల్లూకాలు చొచ్చుకొచ్చి
మా గంజి మెతుకులైన
వనాల జీవాన్ని తీస్తున్న
అరాచక శక్తుల ఆటవిడుపు నుండి
రక్షించదానికిపుడు
ఏ 'కంఠమహేశ్వరుడు' పుట్టుకు రావాలి ?
వనంమీద దాడిచేసిన
గజాసురుల దేహం నుండి
రాలుతున్న రక్తం బొట్టు బొట్టుకు
వెయ్యిమంది పుడుతున్న రాక్షసుల నుంచి
విముక్తి కల్పించిన 'రేణుకాయల్లమ్మ'
మళ్ళీ మళ్ళీ మా వనాల్ని కాపుగాసేకి
ఎన్నిసార్లు అవతారమెత్తాలి ?
నేలను రూకలుగా చూసేటోళ్ళు
కాంక్రీట్ వనాల్ని కలగంటారు
మా చేతిలోముద్దను కూలగొట్టి
పూడ్చలేని లోతైన పేగుల గాయం చేశారు
విత్తనాలతో పురిటినొప్పులు
పోసుకోవాల్సిన నేల
ఇనుముపాదాల నాట్లు వేసింది
తాటి ఈత మొక్కలు
యిగురు లెయ్యాల్సిన చోట
లోహ రెక్కల మర్రి
జడలు విప్పింది
ఇపుడు నావృత్తి
ఖద్దరు,ఖాకీ ,కార్పొరేట్ దళారీ మనువుల
కొక్కెనికి వేలాడుతున్న
బానిస విధేయతకు విచారిస్తున్నా –
వృత్తికి మాకు అడ్డుగోడలై నిలిచి
వాళ్ళు కొల్లగొట్టింది
మా కంచంలోని అన్నమే కాదు
మా తరతరాల శ్రమ సంస్కృతిని
××××

ఇపుడు మా ఇండ్లల్లో
పుట్టుకతోనే జీవితం
ఆకలి సంకెళ్ళలో బంధింపబడుతోంది ...!
నాదైన మా గౌండ్లోళ్ల పిల్లల
బాల్యమెవరిదైనా పేజీలమధ్య
దాచుకున్న నెమలీకల జ్ఞాపకం కాదు
యింటి నుంచి ఈదులు
కల్లంగడి దాకా సద్ది మూట్లను మోసిన
ఒంటెద్దు బండి



ప్రతీ వేకువజాము
కళ్ళు నులుముతూ లేచే
మా కనుపాపల్లో
తడిమేఘం కావాల్సిన నాయన
ఊరవతలే రోజూ
ఉదయమై కురుస్తాడు.
పగలు రెప్పలు
వాల్చుకుంటున్నప్పుడు
గుండెలమీద జోకొట్టి
నిదరపుచ్చాల్సిన తాను –
గుమ్మానికి చూపుల్ని వేలాడదీసి
జారుకుంటున్న
మా నిద్ర కండ్లల్లో మిగిలిపోతాడు.
ఎదురు కాపులలోనే దినమూ
మేము ఘనీభవించిన
కలల లేగ దూడలమయితాం.
అందరి పిల్లల్లా మేం
మా నాయన మోకాళ్ళ మీదెక్కి
గుగ్గూగు ఊగలేదు
వీపుపై నిలబడి గుర్రం స్వారీలు చేయలేదు
ఈదుల్లో లాలం అరిగిన ఎద్దయి
పొద్దంతా తిరిగాడే నాయన
మా బాల్యం ఆటబొమ్మయింది ఏనాడు ?
మా ఈడోళ్లు బళ్ళో బలపంపట్టి
అక్షరాలు దిద్దుతుంటే
మేము గుగ్గుల్ల గలాసుల్ని
కల్లుముంతల లెక్కల్ని
బొగ్గుతో గీతలేసేటోళ్ళం.
మా ఈడు పిల్లలు
సంకలనిండా బొమ్మలు కూర్చి
సందులెంట ఆటపాటలతో తిరుగుతుంటే
ఎంగిలి ముంతలన్నీ వరుసపేర్చి
సుతారంగా సబ్బుముక్కతో
కడగడంలోనే
అరిగిపోతుంటుంది మా బాల్యం !
జతగాళ్ళు గుగ్గుల్లోడ , ముంతోడ
అని పిలిచే
అడ్డపేర్లు చెవిలో సీసం
పోసినట్లుంటుంది.
ఉన్నత కులాల
లోకువతనపు మాటలకు
గట్టుమింద పడిన చాప పిల్లలా
గిజ గిజ తండ్లాడతుంటుంది మనసు !
మాలోకి మేము నత్తలా
ముడుచుకుపోతుంటాం !!
మా పాక ముందు నడుస్తా
మా నీడ సోకితేనే సావుకారి చెయ్యి
ముక్కుకు అడ్డుగోడై నిలుస్తుంది
మా రెక్కల కష్టాన్ని
మీ మేజా అరల్లో పండించుకున్న
రూకలకి రాని వాసన
మీమెట్లా వస్తిమి? సావుకారయ్య!
మీ మనసులే రోత ! మా వాసనలో కాదు
అది మా చెమటలోని శ్రమసుగంధం !
ముంత దించి
మూతి తుడుచుకున్న
మైకం కండ్లన్నీ
మా ఆడోళ్ల పెయ్య మీద
కొలతలు తీస్తుంటాయి
దళారీల చూపులన్నీ
మా ఇంటి గుమ్మంలో
సొంగలు కారుస్తుంటాయి
వాళ్ళ చూపులకే కాదు
మాటలకు కత్తులుంటాయి.
తాటి మొద్దులని
రాలని ఈతాకని
ఎంగిలి చిప్పలు కడిగే బతుకులని
కల్లు కంపుగాళ్లని
పరిహాసపు చితిమంటల్ని
మా ఎదలో రాజేస్తుంటారు.
గుండె వెయ్యివక్కలైనట్టి
ఏడ్పుల సప్పుళ్లన్నీ
రాత్రి చెరుగులో దాచుకున్న వెన్నో
ఇంకా ఎన్నెన్నో ...
ఊరందరి కడుపు చల్ల చేసిన చోట
ఛీత్కారాలు చీదరింపులు ఎగతాళీలు
తిట్లదండకాలు బూతుపురాణాలు
చెవులు నిండుగ వింటూ
తట్టుకుని నిలబడే మా ఆత్మగౌరవం
గాయపడి రక్తమోడుతున్న 'శాంతి కపోతం'.
×××

ఈదులు చితికిపోయి
గీత పనిలేక
మా చిన్నాయన గొర్రెలకాపరిగా
జీతానికి కుదిరితే
ఏమి చేయలేని నైరాశ్యం
ఊర్పు నిట్టూర్పుల ఏకోస్వరగీతాన్ని
ఇంటిల్లిపాది
ఒంటరి దేహమై పాడుకున్న విషాదజీర
మానాయన
నన్ను ,కల్లుకుండని
చెరో భుజం పై యెత్తుకొని
మాయమ్మను తోడుగా వై.సి.పల్లి దాకా
వలసపోయిన మేము
కన్నవూరిలో పునాదుల్లేని గోడలం
పోసేముంత
కల్లుతో తడవకుండా
మా నాయన కన్నీళ్లతో
తడిసిన జ్ఞాపకం
నా కంటిపాపల వెనుక పచ్చబొట్టులా
ముద్రించుకునే వుంది
తొమ్మిదిమంది సంతానానికి
చెరోవైపు తెడ్లుగామారి
బతుకు నావను ఒడ్డుకుచేర్చిన
మా యవ్వతాతలు –
కాలం వొంపిన
దుఃఖతీగల్ని పట్టుకుని
ఏడుపదుల విరామసంధ్య వయసులో
కడుపు స్తన్యం ఒట్టిపోయి
సొంతూరిని వదిలి ధర్మవరానికి
దొరికిన పనిలో కూడుదామని వెళ్తుంటే
ఏమిచేయలేని నిష్క్రియా స్థితిలో నేనూ –
పిల్లబద్ద కు
ఎంత సానబెట్టినా
మొనదేలని బతుకులాయ మావి –
ఇపుడు మా నాయన
రెక్కలు ఇరిగిన గువ్వ
పర్రెలు చీలిన ముంత –
చెట్టెక్కిదిగి కాళ్ళు సచ్చుపడి
అప్పుల కుప్పల మడతలు
దించుకోలేని ఒంటరిఖైదు
ఆశ చావని సీమ రైతు
మా తాత వోటుపడిన కుండ
చిక్కెంలో జారి మంటిలో
కలిసిన బువ్వ –
మా బతుకు
పూలన్నీ తెంచుకెళ్లాక
మిగిలిపోయిన పూలమొక్క
×××
మొన్న మొన్నటి వరకు
వృత్తిమీద
వేలకువేలు పన్నులు కట్టిన
ఏకైక కులవృత్తి మాదే –
రాజ్యమే రౌడీ యై
మాపై దందా చేసింది .
తరంనుంచి తరానికి వృత్తిగా
ప్రవహిస్తున్న వాళ్ళం
అబ్కారీ సీలుముద్ర మా నుదిటిపై
ఆధార్ కార్డయితేనే
మాకు గీత ఫించనందేది.
పోగొట్టుకున్న దేదో



పొందిందేదో ఎరుకలేని
మా గీత శ్రామిక జీవనం
పేరేదైతేనేం ప్రతీవూరిలో
మా బతుకల్లా
ఎగుడు దిగుడుల ప్రయాణం
యేండ్లకొద్దీ చెట్టెక్కిదిగి
మోకాళ్లన్నీ
అరిగిన బండి ఇరుసులై
నిర్జీవ శకలాలయ్యాయి
ఎత్తుపల్లాలన్నింటిని దాటి
ఎల్లలు లేని ఒడుపు తో
ఎదురొడ్డి వెల్లదీస్తున్న కాలాన
చెట్టు నుండి పట్టుతప్పి నేలబడ్డ గీతన్న
శాశ్వత అవిటితనంతో
ఇల్లంతా దుఃఖగోళమై
ఎదలో వణుకుతీగ శృతి చేస్తుంది
సాగుతున్న మా కలలనౌక
శిథిలవయవాల ముద్దై
మట్టి అలల పై
ముందుకు కదలడమన్నది
గీత బతుకుకొక
శేష ప్రశ్నే ?
చెట్టు మీది గీతన్నాకారం
గ్రేటర్ దెన్ –
తల్లి కొలికె గొంతు గాజులు సడలి
పిల్ల కొలిక జారితే
మా బతుకు లెస్ దెన్ !!
×××
పురాణాలు మొలసిన
తాటికమ్మలపై
మా జీవితాలు మొలకెత్తకపాయ
ఇతిహాసాలు అక్షరాలై పూసినచోట
మా బతుకులు
బీజాక్షరాలు కాయకుండావుంది
ఊరూర వనాల్లో పరుచుకున్నతడిముద్దలు
మా కన్నీటి వానలవి –
ఆకలి చావులు
వనంలో పురుగుపుట్రల మధ్య
తనువుల చాలింపులు
రోజూ ఏదోమూల చావుకేక
వృక్షాల వీపును రాసుకుంటూ
నేల రాలిన ఉత్తరం
గీతన్న యింటి
తలపాటు దీపమై పలకరిస్తోంది
ముక్కలైన తలలు
వెన్ను విరిగిన దేహాలు
పురి తిరిగిన కాళ్ళు
లెక్క తేలినవి కొన్ని –
లెక్కలో లేనివి మరికొన్ని!
'మల్లాపురం'
కొత్తకొండ సమ్మయ్య లా
అప్పుల పడగ నీడలో
ఉరేసుకున్న గొంతులెన్నో ?
మోకుతెగి మన్నంటిన
'పోలంపల్లి' గుండ్ల దానయ్య లాంటి
కలలు పగిలిన కుటుంబాలెన్నో ?
శీతగాలి పోటుకు
చెట్టునుంచి పట్టుతప్పిన
'వెలివోలు' వీరబాబు గౌడ్ లాంటి
విషాద గాథలెన్నో ?
పుండు చిదిమిన
చీముగా స్రవించే
పూటకొక్క దుఃఖ వ్యథ !!
పాలకుల ఉపశమనపు మాటలు
మా చావులకు లేపనాలు కాలేదు
మా కంటికొలకుల్లో తెగిపడుతున్న
దుఃఖ కడలికి అడ్డుకట్ట వేయకుంది.
కునుకేయని కనురెప్పలుగా
పిసరంత ఆసరాకు
కాయలు కట్టిన కళ్ళతో చూస్తున్న
ఆశల చకోరలం
కొయ్య పెట్టని గెలలా
కమ్మల గరికె కు
ఎదురుచూసే కుండ..లం.
కరిగిపోతున్న కాలం కెన్వాస్ పై
మా పలవరింతల్ని సవరించిన
ప్రభుత్వాలు లేవు
పరితపించిన హృదయాలనిండా
రసికారుతున్న గాయాలే
ఇపుడు
మా జీవితాలు మడ్డి నిండి
దోనిబల్ల నోట్లో నుండి
వూలిపడుతున్న
ఈతాకు అస్థికలు
పుట్టిపెరిగిన నేలమీద నుంచి
ఎవరో పీకి అవతల పడేస్తున్న బాధ –
సృజనాత్మకంగా
వృత్తినైపుణ్యం పండించిన
మా గీత పనిముట్లన్నీ అటకెక్కిన
పాత గోతాము మూటల్లో చేర్చాం
వాటితో పాటు
మా ఆత్మల్ని కూడా మూటగట్టాం !
రేపటి మాపిల్లలు
వాట్సప్ ,ఫేస్ బుక్
డిస్ప్లే పిక్చర్ లుగా
'చెట్టెక్కిన మా బతుకు చిత్రాన్ని'
షేర్ లు చేసుకుంటూ మురిసిపోవల్సిందే !!
రాజ్యం మాకు
మిగిల్చిన వారసత్వం –
చెట్టునుంచి వలస
వృత్తి నుంచి వలస
వూరు నుంచి వలస
బతుకు నుంచే వలస
ఆధునిక సామ్రాజ్య వాద జేబుల్లో
మా చెమటను ఎరువుగా పోసి
మా కంట్లో వేలుపెట్టి
మనుగడ అంధకారం చేస్తున్న రాజ్యమా
నీకు వేనవేల జోహార్లు
కల్లు గుడిసె తడికెల నరాలకు
చెవి ఆన్చి విను
సగం మాడి సగం మాడని రొట్టెలా
పేగు శకలం మెదులుతున్న
గాయం చప్పుడు
కుండపోత చీకట్లలోకి
రాతి కనుగుడ్లను తెరిచి కను
గీతకత్తి నుండి రాలుతున్న
శ్రమ రుతువు దుఃఖపు ఊటని
బ్రతకడం ఓ ప్రశ్నగా మారినప్పుడు
మృత్యుబిలం అంచున నిలబడి
నిత్యం స్వారీ చేసేవాళ్ళకి
ఎదురించి కలబడే తెగింపు ఒక లెక్కా ?
మాకు మీ జాలిమాటలొద్దు
డబ్బు మూటలొద్దు
ఓట్లు రాల్చుకునే కపట కన్నీటి
నాటకాలొద్దు
మా చావులకు చెల్లించే
నష్టపరిహారాలు
మా కుటుంబాల్ని నిలబెట్టే
చెట్టు కాలేదు
మమ్మల్ని బతికించే
మాకు బతుకునిచ్చే చట్టాలు కావాలి
వృత్తి ప్రతీ ఒక్కరి
ఆర్థిక మూలం ,ఆత్మ సంతృప్తి
ఆత్మ గౌరవం , సొంత అస్తిత్వం !
ఆధునిక మనువాదులు మింగిన
మా నీడలు
తెలబారి పోయాయి
దేహం మాది
నీడ మరొకనిది
కాలం పులిలా
నేలపైని బింబం
మా దేహాన్ని నంజుకుతింటోంది.
మా మూతులు బిగబట్టి
కడుపుకు కుడవనియ్యక
వృత్తిని వొట్టిన పాలిండ్లను చేసిన
పరాయితన గుంటనక్కలకు
సమాధుల్ని తవ్వాలి
కళ్లంలో వరదలెత్తిన
దళారీ పాముల్ని
పాయదీసి సాగనంపాలి.
ఇపుడు మా దావలో
ముండ్లున్నాయ్ రాళ్లున్నాయ్
సక్క దోవ చేసుకొనే శక్తి మాకుంది.
ఎండ పొద లాంటి ఓ పద్యమై
నేలకు వొరగని
ఈతాకు గుండెలయ్
రొమ్ము విరుచుకు నిలబడే
తాడి పిడికిలయ్యే తెగువుంది.
వచ్చి పడిన విపత్తు
ఎదుర్కోవాలంటే
తళుకొత్త వ్యూహాలను అల్లుకుతీరుతాం
మోకులన్నీ కలిపి
ఉరిముడిని పేని
రాజ్యం మెడలో మాల కట్టి
ఉలుల కవాతుతో
భరత వాక్యం పాడుతాం.
విసిరేసిన మా కలల్ని
ఆకలి నుంచి, ఆవేదన నుంచి
సర్వాయి పాపనుని వారసులమై
బహుజన అస్తిత్వ గొంతుకలై
అరచేతిలో చిట్లిన వేళ్ళని
మూకుమ్మడిగా పోగేసి
ప్రభవించక తప్పదు.
మమ్మల్ని
లోహపు చేతుల్లో చుట్టేసిన
ఖడ్గమృగాల తో
యిక మా పోరాటం
ఈ యుద్ధం
మా బతుకులపై రాలే
ఉదయం కావాలి
గీతగాయం తాలూకు
కన్నీళ్లు చెరిపేదవ్వాలి ..!!
ద్రవ్యతంత్ర వంచన కత్తులకింద
కులవృత్తులు చితికిన అల్పిప్పలు
వృత్తికారుల పొత్తికడుపులో కసిగా
దింపిన ఆయుధం సరళీకరణ
ఇపుడు కులవృత్తి మీద
నిలబడి బతకడం
ఓ సవాల్
వర్తమానం ఆందోళన
భవిష్యత్ అంధకారం
పల్లె ఆత్మగౌరవ తోరణాలన్ని
పట్నం ఆర్చ్ లకు
వేలాడుతున్న శవాలు
మార్చురీ గదిలో తెల్లగుడ్డదోసిట్లో
శాశ్వత ధ్యానముద్రలో
మునిగిన యోగులు
వృత్తి నుండి
ఇంకో వృత్తికి మారడం –
గుండెను ఇంకో దేహంలో పూడ్చుకోవడం
మన దేహానికి మనమే పరాయితనం.
అన్ని వృత్తుల్లానే
గీతది కుతకరించి
ఎన్నటికీ మానని ఆకలి గాయం.
గిర్రున తిరుగుతున్న కాలచక్రంతో
మా బతుకు చక్రం సమవుజ్జి కాలేక
చతికిల పడిన ముంత రెక్క
కల్లు కాలం చెల్లినదయ్
గీత చెట్టు కూలినవైనం
లొట్టి పేగులు
సుట్లు తిరుగుతున్నాయ్
ముంత కండ్లల్లో ఎడారి ఖడ్గం
మా చేతుల్ని ఎన్ని కొమ్మల్ని
చేసుకున్నా
బతుకు ధార
నిరాకార జీవనాధారం
ఇపుడు కులవృత్తంటే
రైన్ షాడో డెసర్ట్ –
నీడలు వాలడమే కానీ
కడుపునేలకు మెతుకుల చినుకంటదు
అవమానం వివక్ష
అసమానత అర్థాకలి
నిస్సహాయ జీవన సంఘర్షణ లో
వర్తమానతరం వృత్తి నుండి
మక్కువ మర్లి
కొత్త దారుల్ని మలుచుకుంటోంది
ఉలి పలికిన చేయి
బలపం దిద్దమంటుంది
తాడి చెట్లెక్కిన కాళ్ళు
బడి మెట్లెక్కమంటోంది.
కుల విద్యలన్నీ
మా తాతలు ఏలిన కథలు
మా నాయన నడిచిన బాటలు
నేను చెప్పుకోవడానికి
మిగిలినవి కొన్ని మాటలు
మరి
నా బిడ్డలకు...?



# గురువులకే గురువు - వేదవ్యాస మహర్షి



"మహా గురువు"గా పరిగణించబడుతున్న వ్యాస మహర్షి జన్మదినం సందర్భంగా హిందూ సమాజం ఘనంగా నిర్వహించుకునే పర్వదినం 10 జూలై 2025 రోజున "గురు పూర్ణిమ" లేదా "వ్యాస పూజ"గా పేరుగాంచింది. "గురువులకే గురువు"గా వ్యాస మహర్షిని గుర్తిస్తారు. అజ్ఞానపు చీకట్లను తొలగించి జ్ఞాన వెలుగుల వైపు నడిపించే శక్తి వ్యాస పూర్ణిమకు ఉందని భావిస్తారు. బౌద్ధ పురాణాల ప్రకారం, గౌతమ బుద్ధుడు తన మొదటి ఏడుగురు శిష్యులకు తన తొలి ఉపన్యాసం ఇచ్చిన రోజుగా కూడా బౌద్ధ మతస్థులు గురు పూర్ణిమను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. ఇదే గురు పౌర్ణమి రోజున సాయిబాబాను కూడా పూజించడం జరుగుతోంది. గురు పూర్ణిమ పర్వదినం రోజున ప్రత్యేక పూజలు చేయడం, పాటలు-శ్లోకాలు పఠనాలు జరపడం, పువ్వులు-బహుమతులు సమర్పించడం, ప్రసాదాలు పంపిణీ చేయడం లాంటి సాంప్రదాయంగా మారింది. భారతీయ సాంప్రదాయాల ప్రకారం, గురువు, విద్యార్థుల మధ్య పవిత్ర బంధాన్ని "గురు-శిష్య పరంపర"గా అభివర్ణిస్తారు. జైన మతస్థులు తమ తొలి శిష్యుడు గౌతమ స్వామికి గురువుగా మారిన భగవాన్ మహావీరుడిని గురు పూర్ణిమ రోజున పూజిస్తారు.

**గురు పూర్ణిమి విశేషాలు:**

నేడు మన విద్యాలయాల్లో నిర్వహించుకునే ఉపాధ్యాయ దినోత్సవం కేవలం అకడమిక్ సంబంధాన్ని కలిగి ఉంటున్నది. గురు పూర్ణిమ మాత్రం ఆధ్యాత్మిక - విద్యాగురువులకు అంకితం చేయబడు తున్నది. "గురు" అనే సంస్కృత పదంలోని 'గు' అనగా "చీకటి" అని, 'రు' అనగా "తొలగించుట "అని అర్థం వస్తుంది. అజ్ఞానమనే చీకట్లను తొలగిస్తూ జ్ఞానమనే వెలుగులను నింపు మానుభావుడిగా గురువుకు కీర్తి ఉన్నది. హిందూ చాంద్రమాన క్యాలెండర్ ప్రకారం, ఆషాఢ మాసంలోని పౌర్ణమి రోజున గురు పూర్ణిమ నిర్వహించుకుంటున్నాం. ఈ రోజున "పాద్యపూజ" పేరున గురువుల పాదారాధన చేస్తారు. గురు పూర్ణిమ రోజున తమ జీవితాలకు మార్గ నిర్దేశనం చేసిన గురువులను సత్కరించుకోవడం, వారి ఆశీస్సులు పొందడం జరుగుతుంది. ప్రపంచ మానవాళికి కూడా గురువుగా వ్యాస భగవానుడికి గుర్తిస్తారు. వేద కాలం నాటి సంస్కృతిని నాలుగు వేదాల్లో సంకల్పం చేసిన కారణంగా అతడిని వేద వ్యాసుడు అని కూడా పిలుస్తున్నాం. ఇతిహాసంగా పిలువబడుతున్న మహాబారతాన్ని (భగవద్గీతను కూడా) రచించిన మహా గురువుగా వ్యాస మహర్షికి దేవుడి రూపమని గుర్తిస్తున్నాం. రామలక్ష్మణులు - విశ్వామిత్రు డు, ద్రోణుడు - అర్జునుడు, పరశురాముడు - భీష్ముడు వంటి గురు శిష్యులు మన హిందూ సాంప్రదాయంలో పూజ్యనీయులుగా కనిపిస్తు న్నారు.

**వేద వ్యాసుడు:**

మహాభారత ఇతిహాసం, అష్టాదశ పురాణాలు, వేదాంత బ్రహ్మ సూత్రాల రచయితగా వ్యాస మహర్షికి పేరుంది. ద్వాపర యుగం చివరలో పరాశర మహర్షి, సత్యవతిలకు వ్యాసుడు జన్మిస్తాడు. యమునా నది ఒడ్డున ద్వీపంలో జన్మించడంతో ఆయనను ద్వైపాయనుడిగా కూడా పిలుస్తున్నాం. వ్యాసుడు జన్మించిన వెంటనే తల్లి అనుమతి తీసుకొని తపోవనానికి వెళ్ళి "అఖండ తపస్సు"ను ఆచరిస్తూ, వేదాలను అధ్యయనం చేసి, జ్ఞానాన్ని పొందుతాడు. వేదాలను బు?గ్వేదం, సామవేదం, యజుర్వేదం, అధర్వ వేదం అను నాలుగు భాగాలుగా విభజించడంతో వేద వ్యాసుడిగా పిలువబడుతున్నాడు. వైశంపాయనుడిగా కూడా పిలువబడే వ్యాస మహర్షి కృష్ణుడి వలె నల్లటి రంగును కలిగి ఉండడం విశేషం.

విష్ణువు పాక్షిక అవతారంగా కూడా వ్యాసుడిని భావిస్తున్నాం. సప్త చిరంజీవుల్లో ఒకడిగా భావించు వ్యాసుడు ఇప్పటికీ జీవించి ఉన్నట్లు భావిస్తారు.

(10 జూలై "గురు పౌర్ణమి" సందర్భంగా)

-డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# గనికార్మిక శ్రమజీవుల యదార్ధ జీవితాలే 'వెలుగుల వెనుక'

## -వేల్పుల నారాయణ కథల సంపుటి ఆవిష్కరణలో వక్తల ప్రశంస



హైదరాబాద్, జులై 9:పుడమి గర్భం నుంచి నల్ల బంగారాన్ని వెలిక్కితీసి సమాజంలో వెలుగు నింపుతున్న గనికార్మిక శ్రమజీవుల యాధార్థ జీవితాలే "వెలుగుల వెనక" కథా సంపుటి అని పలువురు వక్తలు ప్రశంసించారు. హైదరాబాద్ లోని రవింద్ర భారతిలోమంగళవారం అభ్యదయ రచయితల సంఘం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, నవచేతన పబ్లిషింగ్ హౌస్ సంయుక్త ఆధ్వర్యంలో అభ్యుదయ రచయితల సంఘం జాతీయ కార్యదర్శి వేల్పుల నారాయణ రచించిన వెలుగుల వెనుక కథాసం పుటి పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. అరసం అధ్యక్షులు డా.పల్లేరు వీరస్వామి అధ్యక్షతన జరిగిన ఈ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన తెలుగు యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎస్.వి సత్యనారాయణ 'వెలుగుల వెనుక' కథా సంపుటిని ఆవిష్కరించగా, ప్రముఖ కథా రచయిత విమర్శకులు కె.పి.అశోక్ కుమార్ పుస్తకాన్ని పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు కందిమళ్ల ప్రతాపరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కళవేణ శంకర్, ప్రముఖ రచయిత, నవ చేతన పబ్లిషింగ్ హౌస్ సంపాదకులు డాక్టర్. ఏటుకూరి ప్రసాద్, నవ చేతన విజ్ఞాన సమితి జనరల్ మేనేజర్ ఎన్.మధుకర్,అరసం ప్రధాన కార్యదర్శి డా.రాపోలు సుదర్శన్, సమన్వయకర్త కెవిల్, ప్రముఖ నవల రచయిత డా.కాలువ మల్లయ్య, తెలంగాణ బిసి కమిషన్ మాజీ ఛైర్మన్ బి.ఎస్.రాములు, పుస్తక రచయిత వేల్పుల నారాయణ ప్రసంగించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎస్.వి.సత్యనారాయణ మాట్లాడుతూ నిమగ్నత నిబద్ధత నిబిడిత సంగమం ప్రముఖ రచయిత వేల్పుల నారాయణ రాసిన వెలుగుల వెనుక అగ్రశ్రేణి కార్మిక సాహిత్య కథా సంపుటి అని అన్నారు. కేవలం తెలుగు సాహిత్యంలోనే కాదు. భారతీయ సాహిత్యంలోనే కొత్త చేర్పు ఈ పుస్తకామని,ఇది హిందీ, ఆంగ్లం భాషల్లోకి అనువాదం చెందితే జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతుందని తెలిపారు.ఏటుకూరి ప్రసాద్ మాట్లాడుతూ పుస్తక రచయిత వేల్పుల నారాయణ వెనుక అభ్యుదయ రచయితల సంఘం ఉద్యమం ఉంది.ఆ ఉద్యమానికి భౌతికవాదమనే పునాది ఉందని.ఆ పునాది మీదనే రచయిత శ్రమజీవుల జీవితాల కథకే అక్షర రూపం ఇచ్చారన్నారు. వేల్పుల కథల్లో చాల కథల్లో కార్మికుల వ్యక్తిగత,సమాజిక జీవితాల్లో ఉండే అతి సున్నితమైన భావాల్లో కూడా దోపిడి ఎలా జరుగుతోందో కళ్లకు కట్టారన్నారు.కథకు ఉండాల్సిన క్లుప్తత,స్పష్టత, తాత్వికత, సుందరత, వాస్తవికత, అన్నింటికి మించి నిబిడిత అన్నీ వేల్పుల కథల్లో ఉన్నాయని తెలిపారు.చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సింగరేణి కార్మికుల బతుకులకు ప్రతి రూపమే వెలుగుల వెనుక కథా సంపుటి అని అన్నారు.ఎంతో మేధోశక్తి, లోతైన విశ్లేషణతో రచయిత సమాజాన్ని మేల్కొపే రీతిలో వేల్పుల 'చురకలు'అనే కాలంతో కవిత్వాన్ని రాయడం అభినందనీయమన్నారు. కాలువ మల్లయ్యమాట్లాడుతూ కార్మికులపై అనేక కథలు వచ్చాయని, కాని వేల్పుల స్వీయ అనుభావాల ఆధారంగా రాసిన వెలుగుల వెనుక కథాల్లో చాల బలం ఉందని ప్రశంసించారు. కందిమళ్ల ప్రతాపరెడ్డి మాట్లాడుతూ పుస్తక రచయిత నిరంత కృషీవలుడని,ఎప్పుడు ఏదో ఒక్కటి రాస్తునే ఉంటాడన్నారు.మధుకర్ మాట్లాడుతూ వెలుగుల వెనుక అనే కథా సంపుటి సింగరేణి కార్మికుల జీవితాలకు అక్షర రూపంలో వెలువడిన ఓ డ్యాకుమెంటరీ అనిఅన్నారు.

రచయిత వేల్పుల నారాయణ మాట్లాడుతూ ఒకటి రెండు కథలు తప్ప అన్నీ కథలు వాస్తవ సంఘటన లేనని,తాను అనుభవించి రాసినవేనని, తన కథల వెనుక వాస్తవాలు తనను ఎలా స్పందింప పచేశాయో వివరించారు. ఈ కార్యక్రమానికి అరసం సమన్వయ కర్త కెవిఎల్ స్వాగతం పలుకగా, అరసం ప్రధాన కార్యదర్శి డా.రాపోలు సుదర్శన్ వందన సమర్పణ చేశారు. ఈకార్యక్ర మంలో నవ చేతన పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ పి.నారాయణరెడ్డి పలువురు కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.



ప్రఖ్యాత రంగస్థల కీ॥శే॥ గరిమెళ్ళ రామమూర్తి గారి 85వ జయంతి సందర్భంగా రంగస్థల పురస్కారాన్ని రసరంజని హైదరాబాద్ వారు కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురాంకు ఐపిఎస్ (రి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి బహూకరించారు. రసరంజని వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ హెచ్.జి.దొర, తదితరులు పాల్గొన్నారు.

# వేదాలు భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు

వేదాలు భారతీయ సాంస్కృతిక వారసత్వ సంపద అని ఐఏఎస్ విశ్రాంత అధికారి డాక్టర్ కే.వి.రమణాచారి అన్నారు.బుధవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత డాక్టర్ చిర్రాపూరి శివరామకృష్ణశర్మ రచించిన ఋగ్వేదానికి రాహుల్ గ్రహణం, గ్రేట్ మిస్‌ఫార్చ్యూన్ ఆఫ్ అవర్ నేషన్ ఈజ్ దట్ వి ఆర్ నాట్ అవేర్ ఆఫ్ రియల్ హిస్టరీ పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న డా॥కె.వి.రమణాచారి పుస్తకాలను ఆవిష్కరించి మాట్లాడారు. సాహిత్యరంగానికి చిఱ్ఱాపూరి శివరామకృష్ణశర్మ చేస్తున్న సేవ ఎనలేనిదని అన్నారు. భారతీయ విలువైన వేదాలు వైద్య, విజ్ఞాన శాస్త్రాలు వక్రీకరణ జరిగాయని తెలిపారు. రచయిత శివరామకృష్ణ 'ఋగ్వేదానికి రాహుల్ గ్రహణం' పుస్తకంలో వేదాల గురించి చక్కగా వివరించారన్నారు. కార్యక్రమంలో డా॥ రేవూరి అనంత పద్మనాభరావు, మల్లం వీరేందర్, సవరం వేంకటేశ్వరావు, వి.ఎ.కుమారస్వామి శాస్త్రి, కిన్నెర రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

# భరద్వాజ, కాంతమ్మ స్మారక పురస్కారాల ప్రదానం



పురస్కారాలను ప్రదానం చేస్తున్న వంశీరామరాజు, చెన్నయ్య తదితరులు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత డా॥రావూరి భరద్వాజ స్మారక సాహితీ పురస్కారం, రావూరి కాంతమ్మ స్మారక సాహిత్య సేవా పురస్కారం శనివారం రాత్రి త్యాగరాయ గానసభలో జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగింది. అనంతపురానికి చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త బండి నారాయణస్వామి, ప్రముఖ రచయిత్రి కన్నెగంటి అనసూయకు ఈ పురస్కారాలను వంశీ సంస్థల అధినేత డా॥వంశీ రామ రాజు, తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా॥జె. చెన్నయ్య బహూకరించి, సత్కరించి ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో రావూరి భరద్వాజ, రావూరి కాంతమ్మ ట్రస్ట్ ప్రతినిధి రావూరి వెంకట కోటేశ్వరరావు, జీఎస్‌కే మాధురి, పెద్దూరి వెంకటదాసు, సంస్థ ఛైర్మన్ గుదిబండి వెంకటరెడ్డి, లయన్ రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్యామగాయత్రి మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ చిల్లా శివపార్వతిచే గానవిభావరి జరగగా శేషభట్టార్ ఆరోహి శరణ్య నృత్యాన్ని ప్రదర్శించారు.






# 16వ జాతీయస్థాయి 'సోమేపల్లి' పురస్కారాలకు చిన్న కథలకు ఆహ్వానం

జాతీయస్థాయిలో గత పదిహేనేళ్ళుగా తెలుగు చిన్న కథల పోటీలు నిర్వహిస్తూ తెలుగుసాహిత్యరంగంలో విశిష్ట అవార్డులుగా ప్రఖ్యాతని చాటుకుంటున్న సోమేపల్లి సాహితీ పురస్కారాలు ఈ ఏడూ ఇవ్వాలని సోమేపల్లివారి కుటుంబం నిర్ణయించింది. కథారచనను పరిపుష్టం చేసే ఉత్తమ కథలు వెలుగుచూడాలని, తద్వారా రచయితలను ప్రోత్సహించి, తెలుగు కథ గొప్పదనాన్ని ధదిశలా చాటాలనే లక్ష్యంతో... నిర్వహిస్తున్న ఈ పోటీలను ఎప్పటిలాగే విజయవంతం చేయాల్సిందిగా అందర్నీ కోరుతున్నాము...

అత్యుత్తమ కథకు రూ.2500/-, ఉత్తమ కథకు రూ.1500/-, మంచి కథకు రూ.1000/-, ప్రత్యేక బహుమతులు రూ.500/-చొప్పున ఇద్దరికి ఇవ్వబడతాయి. ఈ పురస్కారం కొరకు పంపే కథల నిడివి రాతప్రతిలో రెండు నుంచి 4 పేజీలలోపు, డి.టి.పిలోనైతే 2 పుటలు కాగితం ఒక ప్రక్కనే రాయాలి. ఎటువంటి ఎంట్రీఫీజులేని ఈ పోటీలకు ఒకరు ఎన్ని కథలనైనా పంపవచ్చు. కథ పుటలపై రచయిత పేరుగానీ, ఆయా వివరాలు గానీ వుండకూడదు, కేవలం హామీపత్రంపై మాత్రమే రచయిత వివరాలు పేర్కొనాలి. కథలను సెప్టెంబర్ 30వ తేదీలోపు రమ్యభారతి, పి.బి.నెం.5, 11-57/1-32, జె.ఆర్.కాంప్లెక్స్, రెండవ అంతస్తు, రజక వీధి, విజయవాడ-520001 (సెల్:9247475975) అనే చిరునామాకు పంపాలి. విజేతలకు నగదు బహుమతులతోపాటు, శాలువా, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో ప్రత్యేక సభలో సత్కరించబడుతుంది.

-వశిష్ట సోమేపల్లి
అవార్డు కమిటీ

చలపాక ప్రకాష్
ఎడిటర్, రమ్యభారతి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1503వ రోజు 'ముగ్గు' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'ముగ్గు' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839



### మొక్కుబడి ముగ్గు

నింగిన చుక్కలు తెచ్చి
తారాహారం అల్లినట్లుగా
తోచే చుక్కల ముగ్గు!.
లెక్కగా పెట్టిన చుక్కలతో
చక్కని చిత్తరువోలే తీరైన ముగ్గు!.
లత పద్మాలు,
నక్షత్ర శంఖువుల
ఆకారాలతో రూపుదిద్దుకునే
రమ్యమైన రంగవల్లి!.
ఇంతుల కళానైపుణ్యానికి
సహనానికి
పరిసరాల పరిశుభ్రతకు
తార్కాణంగా నిలిచి
ఇంటికి శోభను చేకూర్చే
ముచ్చటైన ముగ్గు!.
కీటకాలకు లక్ష్మణరేఖగా నిలిచి
కనువిందు చేసే పచ్చని
పేడకళ్ళాపిపై తెల్లని
అందాల మెలికలు
తిరిగిన గీతల ముగ్గు!.
నేడు నేల కరువై
సుద్దముక్కల గీతలకే పరిమితమై
పండుగలకు మాత్రమే ప్రత్యక్షమౌతోన్నశరీరానికి కూడా.
మొక్కుబడి ముగ్గు!!.

-చంద్రకళ దీకొండ

### మనసు మురిసే ముగ్గు

ముగ్గులు వేయడమంటే
చాలామందికి ఇష్టమే
ఉద్యోగాల హడావుడితో
చాలామంది దూరం
కొంతమంది ఇంట్లోనే ఉన్నా
సరిపోయినంత సమయమున్నా
సోమరితనంతోనో
అభిరుచిలేకనో
ముగ్గులకు దూరం
ఐదు చుక్కల ముగ్గుల నుంచి
ఎంతో పెద్ద ముగ్గుల వరకు
సమయానుకూలంగా వేస్తుంటారు
పెద్దవారు ఉన్న ఇంటిలో
ఇష్టం ఓపిక లేకున్నా
వారికోసమైనా వేయక తప్పని పరిస్థితి
ప్రత్యేకించి రథం ముగ్గులు
సంక్రాంతిని సూచిస్తూ ముగ్గులు
మనలను మంత్ర ముగ్ధులను చేస్తాయి
ముగ్గులు వేయడమంటే
వ్యాయామమే మనసుకూ

-నాగిరెడ్డి అరుణ జ్యోతి

### ముంగిట ముగ్గు

మగువల సృజనాత్మక విన్యాసం
ముగ్గు
మెలికల ముగ్గేసి
మనసును గట్టిపరిచే
మధురజ్ఞాపకాలను
పదిలపరచుకోగలరు
మగువ మనసు తెలుసుకోడం
కష్టమని సూచిస్తారు
ఆకాశంలోని నక్షత్రాల్లా
రంగురంగుల
రంగవల్లులను తీర్చిదిద్దగలరు
ఇంద్రధనుస్సు లోని
ఏడురంగులను
భువిపైకి దించి
ఎలాంటి సమస్య నైనా
ఇట్టే వంచేసి
భువిపై పరిష్కార మార్గాలను
కనిపెట్టేయగలమని
సూచనప్రాయంగా
సూచిస్తారు
మగువ మనసును
ఇంటి ముందు పరిచే
అత్యుత్తమ ప్రదర్శననే
ముగ్గు
రకరకాల ముగ్గులతో
మానసిక సంఘర్షణను
పోగొట్టే మార్గాలను
కనిపెట్ట
అత్యంత ప్రాధాన్యత
కలిగిన ఈ ముగ్గు
నేడు
ప్లాస్టిక్ కాగితపు రంగవల్లిక
అందుకే...
చిన్న విషయాలకే
విడాకుల
ప్లాస్టిక్ కాగితపు
జీవితచిత్రాల చందం

-ఆర్.కళ్యాణి

### సుక్కల ముగ్గు-సందిట ముత్యాలు

ఉషాకాంత
స్వాగతపు అందాలలో
చుక్కలముగ్గు
సందిటముత్యాలు
అవని కొలనులో
తామర పువ్వుల సొగసు
పల్లె సీమ లోగిళ్ల ముంగిట
కళ్లాపునీళ్ల నాట్యంలో
అతివలచేతులనుండి
జాలు వారే సుక్కల ముత్యాలు
ఆ కళాఖండాలు
యేశిల్పి చాతుర్యమో
ఆ పడతుల ఎదలో
మెలిగే ఆకృతులు
అపురూపంగా రూపుదిద్దుకుంటూ
అందరి మనసులూ మమతలూ
దోచుకునే సుక్కల ముగ్గులు
పండగ దినాలలో
పెళ్లివేడుకల్లో
ముగ్గుల పోటీలలో
రాయంచ సొగసుల
రంగుల కలయికలో
పరుగులు తీసే చుక్కల తీరు
ధనుర్మాసపు సందడిలో
గుడి గంటల రవళి
ఎడ్ల మెడలో
చిరుమువ్వల సవ్వడులలో
సంక్రాంతి లక్ష్మి ఆహ్వానంలో
వినీలాకాశంలో చుక్కలతో
పోటీపడే సుక్కల ముగ్గుల
సొబగులు వర్ణించ తరమా!

-ఆర్. రమాదేవి

### నేలపై కళ

ప్రాచీన ఆచారం
భారతీయ సంప్రదాయం
ఇంటి వాకిట విరిసే అందమైన కళ
ఉత్తరాదిన రంగోలి
కళ్ళాపి జల్లి
తడి నేలపై రూపుదిద్దేది.
స్త్రీల చేతిలో సౌందర్య లీల
ఆధునికంగా పెయింట్‌తోనూ
పింగాణీ పలకలపైనా చిరస్థాయి.
ప్రతి ఉదయం
పేడనీటిపై అలవాటుగా
మహాలక్ష్మి నడియాడాలని
నమ్మకంతో వేసిన అడుగులై.
విశేష సందర్భాలకే
రంగుల అలంకరణ
శుభకార్యాలకు
నూతన సంవత్సరాలకు శోభ.
సంక్రాంతి ముగ్గులు ప్రత్యేకించి
బంతి రేకులు
గొబ్బెమ్మలతో పండుగకు అందం.
చుక్కలను కలుపుతూ సాగే గారడీ
చుక్కల సంఖ్యని బట్టి వివరణ.
సంక్రాంతి చివరి రోజు రథపు ముగ్గు
అనుబంధపు గీతగా
ఇరుగు పొరుగున పులుగు.

-విజయలక్ష్మి వద్దేపల్లి

### చుక్కల అందం

ముగ్గులు.. ముగ్గులు
ముత్యాల ముగ్గులు
రతనాల ముగ్గులు
ముగ్గు ఏదైనా
మగువల నైపుణ్యానికి
మచ్చు తునక
ఓపిగ్గా వేసే ఓర్పు
అందంగా దిద్దే నేర్పు మగువదే
వాకిలికి అలంకారం
ఇంటికి అందం కావాలంటే
ఇంటి నిండా ముగ్గులుండాల్సిందే
బియ్యం పిండి ముగ్గు పూర్వ రోజుల్లో
ఇంట్లో పేడతో అలకటం
వాకిట్లో కళ్లాపి
బియ్యం పిండి ముగ్గు తాత్కాలికం
ఎక్కువకాలం మన్నేది
సున్నం ముగ్గులు
ఇప్పుడు పెయింట్ తో ముగ్గులు
శాశ్వత అందమిచ్చే ముగ్గులు
ఆకాశంలో చుక్కలు
భువికి దిగివస్తే
చుక్కలన్నీ కలిపి
రకరకాల డి జైన్లు
పువ్వులు పక్షులు
ఆ డిజైన్లలోనే
సంక్రాతికి కనువిందుగా
పెద్ద పెద్ద ముగ్గులు
రథం ముగ్గులు
ముగ్గులు పెట్టటం
అద్భుత కళ.

-మోటూరి శాంతకుమారి

### ఆనందపు ముగ్గు

ఉషస్సుతో ఉదయించిన
రంగవల్లి అందం
ఇంటింటా ఆనంద పరవళ్ళు.
సింగారమొలకించే
చిరునవ్వు ముగ్గు
మనసంతా పూచి
హృదయమంతా నిలిచింది.
ముంగిట్లో ముగ్గులు
రంగురంగులు
జీవనాన్ని మెరిపించి
పండగరోజులలో నిలిచి
అందరినీ ఆకర్షించి
ముగ్గుల పోటీలలో
రంగులల్లి దిద్దిన
బహుమతులు గెలిచిన
ముఖంలో ఎంతో మెరుపు.

- వి. సంధ్యారాణి

### కరవల్లిక

తెలతెలవారె తొలి పొద్దులో
తూర్పు సంధ్యారాగంలో
అరుణారిణమ తేజస్సుతో
ఇంటి ముంగిట
ముత్యాలొలుక బోసినట్లు
సిరులొప్పంగ జవరాలిలా
వయ్యారాలు
పుణికి పుచ్చుకున్న ముగ్ధలా
తీరుగా చుక్కల తారలను తీర్చిదిద్దగా
నొక్కొక్క ఆకృతిన్ దాల్చగా
బుగ్గల సిగ్గుల మొగ్గలా
రూపు దాల్చిన
రంగుల రంగవల్లుల హరివిల్లులా
పడతి చేతల నేతల
నేర్పు నొప్పారగా
చిత్ర విచిత్ర
చిత్రకళా రాజసానికి దీటుగా
లోగిళ్ళు కళకళలాడే
గృహలక్ష్మికి సౌభాగ్య సంపదగా
అందాల అరుణావని
శోభలనాహ్వానిస్తూ
సంస్కృతీ సంప్రదాయాల వాహినికి
నీరాజనం.

- పి.పద్మావతి

### ముత్యాలల్లిన రగ్గులు!

సమస్త జీవకోటికి శక్తినిచ్చే
ప్రభాత సూర్యకిరణాలకి
కృతజ్ఞతా స్వాగతం
ప్రతి ముంగిట్లో అందంగా తీర్చిన
అతివల మనోభావాల రీతులు
ముత్యాలలల్లిన రగ్గులు!.
చలికి నేలమ్మ కప్పుకున్న
చుక్కల దుప్పటిలా
ముగ్గులు
అర్ధరాత్రి నుండే అవతరిస్తాయి
రంగుల మేళవింపు
రమణి ఓర్పుకి తీర్పు
లతల్లో వైవిధ్యంలో
సృజనాత్మకత చేర్పు!.
పర్వదినాల్లో
పల్లె కోడళ్ళ పోటాపోటీ ప్రదర్శన
పేడ కళ్ళాపి అదృశ్యమైనా
కృత్రిమ కళ్ళాపి పొడితో
వాకిలి పచ్చదనం
బంతీ డిసెంబర్ పూలు
ముగ్గు మధ్యలో మురుస్తూ!!.

- ఎం. వి. ఉమాదేవి

### పేరంటాల తోరణాలు

అమ్మలక్కల ఆరాటం
పొదుపుతో పేరంటం
అలికి పూతలతో ఆనందం
మబ్బుల పందిరితో సావాసం
చుక్కల ముగ్గుకు సీమంతం.
ఆడ తనం నిండిన తోరణం
పట్టు పరికిణికి నిండుతనం
చుక్కల ముగ్గుల హారం
గుమ్మం ముందు కొలువుదీరిన
ముగ్గుల తోరణం
పసుపు కుంకుమలతో
ముస్తాబైన గుమ్మం నిండు ముత్తైదువ
గడప ముత్యాల ముగ్గులతో
అలంకారం
పండుగ వాతావరణమే ఇల్లంతా.
సంప్రదాయాల
సంస్కృతులకు నిలయం
పండగ వబ్బాలకు ఆలయం
మూగ మనసుతో ముచ్చట్లు
పెడుతుంది ముగ్గు
కొంటె సైగలతో
కోలాటం ఆడుతుంది ముగ్గు
అందమైన బంధం ముగ్గు
స్వచ్ఛమైన బలగం ముగ్గు
వీచే గాలి ముగ్గు
కలిపే బంధం ముగ్గు
సిరి సంపదల దీపం
చిగురించే ఆశల రూపం
చిగురాకు కోయిల రూపం
ముగ్గు దేవుళ్ళదే?.

-పొన్నాల ధనమ్మ

### లెక్కల ముగ్గులు

మోహన బొట్టు
కొప్పులో పూలు
ఆడాళ్ళు ఆడాళ్ళలా కనపడే కాలం
పోయిందని ఆ కాలం మాట
మా కాలం మాట.
ఇంటి ముందు కళ్లాపి
పేడతో కలిపి చల్లి
చుక్కల ముగ్గు పెడితే చుట్టూ చేరి
చూసి- నేర్చి
చిటికలో వాళ్ళ వాకిట్లలో ప్రత్యక్షం.
లెక్కల మాస్టారు
నా చుక్కల ముగ్గు చూసి
ముక్కున వేలేసుకుని పక్కున నవ్వాడు
"50 చుక్కలెట్టి ఎంచక్కా
మెలికలు తిప్పి వేశావే చిన్నమ్మ!
సంక్రాంతి కుండ
కుండ పక్కన చెరుకు జెండా
సంకురాత్రి పండగ అంతా
నీ ముగ్గులోన మెరుస్తుండ
నువ్వే లెక్కల మాస్టారివి
ఈ చుక్కల లెక్కలు రాక
నాకు తిక్కపుడుతున్నది"
అంటూ అయ్యోరంటే
ఆనాడు తెలియలేదు నాకు.
ఈనాడు అర్థమైంది
చుక్కల ముగ్గుల అందం
అందులోని కష్టం
ఒక్క చుక్క తప్పుపోతే
కప్పిపుచ్చలేం ఆ లోపం.

-డా.సి.వసుంధర






## కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

# 'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు



అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ



### తొలి పండగ

తొలి కాంతి తేజముతో, ఉదయించెను ఏకాదశి,
తపస్సు తలపుతో, హృదయములో వెలసెను ఆశ,
పవిత్రత పరిమళించె, ప్రణయముతో పరవశించె,
పాపాల పరంపరను, పరమునకు సమర్పించె.
ప్రభాతపు పువ్వుల్లా, పరిమళించె పరమేశ్వరి,
పరమాత్మ దయతో, పునీతమవె మనసు,
పద్మాలయ పాదాలపై, పరవశించె భక్తుల పయనం,
పాటలే ప్రార్థనగా, పరవశించె హృదయం.
వ్రతధర్మ పరిరక్షణ, వేదాంత గర్భిత భావం,
విరామం లేని ధ్యానం, విశ్వాసముతో నడిచె,
పుణ్యపు ప్రవాహములో, పావనమవె జీవితం,
పరమపద ప్రాప్తికి, ప్రణాళికగా మారె.
పదునైన పదాలతో, పరవశించె కవిత్వం,
ప్రేమతో పరిపూర్ణం, ప్రతీ అక్షరమూ,
పూజార్చనల శబ్దంతో, పరవశించె గుండె,
ప్రభువు పాద సేవలో, పరవశించె ప్రాణం.
తొలి ఏకాదశి తేజం, తలపులలో మెరిసె,
తపస్సు తపనలో, తృప్తి తలపెట్టె మనసు,
తరచి తలచిన పుణ్యం, తరంగాలై విరిసె,
తొలి ఏకాదశి తేజం, తలపులలో నిలిచె.

-డా.భరద్వాజ రావినూతల
కొత్తపట్నం

### ప్రసిద్ధ పర్వదినం

ఆషాడంలో అత్యంత ముఖ్య దినం
హిందూ ధర్మంలో ముఖ్య పర్వదినం
శ్రీమన్నారాయణునికి ప్రీతికరమైన దినం
తొలి ఏకాదశి నాడే దక్షిణాయణం ప్రారంభం
కొత్త పండుగలకు పలుకుతుంది స్వాగతం.
ఆషాడంలో వచ్చే శుక్ల ఏకాదశే
తొలి ఏకాదశి....
శ్రీహరి
యోగానిద్రలోకి వెళ్లే (శయనించే )
శయనైక ఏకాదశి....
మానవుల పాప కర్మలు ప్రక్షాళన చేసి
అనంత ఫలితాలనిచ్చే అనంత ఏకాదశి.
పుణ్య వ్రతాలకు ఓంకారం పలికే శుభదినం
హిందుత్వంలో పరమ మంగళకర దినం
చాతుర్మాస దీక్షకు పలుకుతుంది ఓంకారం
ఉపవాస దీక్షలకు బహు పుణ్య దినం
శ్రీమన్నారాయణుని సేవతో లభిస్తుంది మోక్షం.
హరినామస్మరణంతో
దొరుకుతుంది
కైవల్య ప్రాప్తం....
హరి భజనతో అవుతుంది
మనిషి జన్మ సార్ధకం...
నారాయణ సేవతో
చేసుకోవచ్చు
పాప ప్రక్షాళనం...!!

-లక్ష్మీ పద్మజ దుగ్గరాజు

### భక్తి ముక్తి ఆరోగ్య ప్రదాయిని

ముజ్జగలనేలి అలసి సొలసి
పాలకడలిపై ఆదిశేషుని ఒడిలో
నిదురించి నిమ్మళించే రోజైన
ఆషాఢ శుద్ధ ఏకాదశి
తొలి ఏకాదశి పర్వదినమై
పరిఢవిల్లె భూతలమువ .
పండుగలకి ప్రారంభ
తొలిఏకాశి నుండియే అని
పురాణ సాంప్రదాయం
వానాకాలం ,రోగాలు
ప్రబలేకాలం ,అందువలననే
చాతుర్మాస్య వ్రతదీక్ష ఆరంభించి
భక్తిప్రపత్తులతో మనసును
ఆహార నియమాలతో ఆరోగ్యాన్ని
అదుపులో ఉంచుకునే
తొలిఏకాదశి పండగ వైశిష్ట్యం.
ఏకాదశి అంటే పదకొండు
అనే అర్థంలో మానవులు
ఐదు జ్ఞానేంద్రియములు,
ఐదు పంచేంద్రియాలు, మనసును
అన్నిటినీ ఒకటిగా చేసుకుని
దైవ నివేదన చేస్తే
ఇంద్రియ నిగ్రహం పెరిగి
ఆరోగ్యం అదుపులో ఉండి
రోగాలు దూరమై మానవులు
ఆరోగ్య భాగ్యాలు పొందుతారు
ఆరోగ్య ప్రదాయిని తొలి ఏకాదశి
పర్వదినం భక్తిశ ముక్తి ప్రదాయకం

-కొలచన విజయ భారతి
హైదరాబాద్

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.